Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక : 326 పేజీలు 8 వెల : 5 మంగళవారం 03 జూన్ 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజి |
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

# మెగా డీఎస్సీ నిలుపుదలకు 'నో' చెప్పిన హైకోర్టు






అమరావతి: ఏపీ మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్ ఆధారంగా ఈనెల 6 నుంచి నిర్వహించనున్న రాత పరీక్షలను నిలిపివేయడానికి (స్టే) హైకోర్టు నిరాకరించింది. పరీక్షలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన అనుబంధ పిటిషన్లను కొట్టేసింది. డీఎస్సీ పరీక్షల నిర్వహణను నిలిపివేయడానికి సహేతుకమైన కారణాలు కనిపించడం లేదని పేర్కొంది. విస్తృత ప్రజాప్రయోజనాలు, డీఎస్సీ పరీక్షలను నిర్వహించే ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో స్టే ఇవ్వలేమంది. హాల్ టికెట్లు జారీచేయడం, పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తచేశారని గుర్తుచేసింది. ఉద్యోగాల భర్తీ విషయంలో విధానపరమైన నిర్ణయం తీసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టంచేసింది. అత్యవసరంగా (హౌజ్‌మోషన్లో) దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. 2011లో ప్రభుత్వం జారీచేసిన జీవో-51 ప్రకారం.. విద్యా సంవత్సరానికి రెండుసార్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాల్సి ఉందని, అందుకు భిన్నంగా ఒక్కసారి మాత్రమే టెట్ నిర్వహించి.. డీఎస్సీ-2025 నోటిఫికేషన్ జారీచేయడం చట్ట విరుద్ధమంటూ చిత్తూరు జిల్లాకు చెందిన పి.ప్రభాకర్, మరికొందరు హైకోర్టులో వ్యాజ్యం వేశారు.

2024 ఫిబ్రవరి 12న జారీచేసిన ఏపీ డీఎస్సీ-2024కి తాము వయసు పరంగా అర్హులమని, దానిని రద్దు చేసి ఈ ఏడాది ఏప్రిల్ 20న జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం అనర్హులమయ్యామని పేర్కొంటూ కొందరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. డీఎస్సీ-2024కు వయసు పరంగా అర్హులై.. అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారందరిని ప్రస్తుత డీఎస్సీకి అర్హులుగా ప్రకటించాలని కోరారు.

సీబీఎస్ఈ(పదో తరగతి)లో మొదటి భాషగా ఆంగ్ల, రెండో భాషగా తెలుగును చదివామని, డీఎస్సీ-2025 నోటిఫికేషన్ ప్రకారం వివిధ పోస్టుల భర్తీకి మొదటి భాషగా తెలుగు చదివి ఉండాలనే కారణంతో తమ దరఖాస్తులను తిరస్కరించారంటూ ఎమ్మిగనూరుకు చెందిన వెలికంటి సాంబశివ వ్యాజ్యం వేశారు. మరికొందరు వ్యాజ్యం దాఖలు చేస్తూ బీఈడీ చివరి సంవత్సరం విద్యనభ్యసిస్తున్న వారిని డీఎస్సీ నుంచి మినహాయించడం చట్ట విరుద్ధమన్నారు. మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణకు కేవలం 45 రోజుల షెడ్యూల్ ప్రకటించడం సహేతుకం కాదన్నారు.


ఏడాదికి రెండుసార్లు టెట్ అవసరం లేదు: ఎస్‌జీపీ ప్రణతి

పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, డైరెక్టర్ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపించారు. వయో పరిమితిని పెంచాలని కోరుతున్న పిటిషనర్లకు 2024 డీఎస్సీ నాటికే అర్హత లేదన్నారు. ప్రస్తుత డీఎస్సీలో గరిష్ఠ వయోపరిమితి దాటిన వారు ఆటోమేటిక్‌గా అనర్హులవుతారన్నారు. నిర్దిష్ట పోస్టుల విషయంలో తప్ప.. మిగిలిన పోస్టులకు సీబీఎస్ఈలో మొదటి భాషగా ఆంగ్లం చదివినవారూ అర్హులేనన్నారు. ఇప్పటికే హాల్ టికెట్లు జారీచేశామని అందువల్ల అనుబంధ పిటిషన్లను కొట్టేయాలని కోరారు.



# భూకేటాయింపులపై ఆరోపణలు రుజువు చేయండి

అమరావతి,:వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మంత్రి లోకేశ్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. ఉర్సా కంపెనీకి విశాఖపట్నంలో ఎకరం రూపాయికే భూములు కట్టబెట్టారు అంటూ జగన్ చేసిన ఆరోపణలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బురద జల్లి ప్యాలస్‌లో దాక్కోవడం కాదు.. చేసిన ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ చేశారు. ఈ మేరకు నారా లోకేష్ ఎక్స్‌లో సవాల్ విసిరారు. వైఎస్ జగన్ గారికి ఓపెన్ ఛాలెంజ్.. మీరు చేసిన ఆరోపణలు నిరూపిస్తే నేను నా మంత్రి పదవికి రాజీనామా చేస్తాను. మీరు చేసిన ఆరోపణలు తప్పని తేలితే రాష్ట్ర యువతకు క్షమాపణ చెప్పండి చాలు. ఆరోపణలు చేయడం, పారిపోవడం జగన్ రెడ్డి గారికి కొత్తేమీ కాదు. ఉర్సా కంపెనీకి విశాఖపట్నంలో ఎకరం రూపాయికే భూములు కట్టబెట్టారు అంటూ మీరు తీవ్ర ఆరోపణ చేశారు. నేను స్పష్టంగా మరోసారి చెబుతున్నా.. ఉర్సా కంపెనీకి విశాఖలోని ఐటి పార్క్ హిల్ - 3 లో ఎకరం కోటి రూపాయలు చొప్పున మూడున్నర ఎకరాలు కేటాయించాం. కాపులుప్పాడలో ఎకరం యాభై లక్షల చొప్పున 56.36 ఎకరాలు కేటాయించాం. బురదజల్లి ప్యాలస్ లో దాక్కోవడం కాదు.. చేసిన ఆరోపణలు నిరూపించండి. ఛాలెంజ్‌కు సిద్ధమా జగన్ రెడ్డి గారు.



# వైమానిక రవాణా పరిశ్రమలో భారత్ కీలక పాత్ర

వేగంగా అభివృద్ధి చెందుతున్నవిమానయాన రంగం

గ్లోబల్ కంపెనీల పెట్టుబడులకు అద్భుతమైన అవకాశాలు

అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం సమావేశంలో మోడీ



ప్రపంచ వాయు రవాణా పరిశ్రమలో భారత విమానయాన రంగం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ రంగంలో భారీ పెట్టు-బడులకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ పౌర విమానయాన మార్కెట్ భారత్‌దే. భారత్‌ను ప్రపంచం కేవలం విమానయాన మార్కెట్‌గా మాత్రమే కాకుండా వాల్యూ చైన్ లీడర్‌గా చూడాలని కోరుకుంటున్నాం. మా దిశ

2లో

## పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై చర్చిద్దామా హరీష్ రావుకు పిసిసి చీఫ్ సవాల్



**హైదరాబాద్,మనసాక్షి:** బిఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చకు రావాలని మాజీ మంత్రి హరీష్ రావును టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని హరీష్ రావును ఉద్దేశించి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించలేదు అనే మాట నిజమా అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులు విలువ తగ్గించిన విధానాన్ని కంచె చేను మేసినట్లుగా ఉందని అంటూ తీవ్ర విమర్శలు చేశారు. అలాగే, హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ భేటీ- అయ్యారని సంచలన వ్యాఖ్యలు చేస్తూ, ఈ సమావేశంపై మా వద్ద స్పష్టమైన సమాచారం ఉందని పేర్కొన్నారు.

## 2వేల నోట్లు ఉంటే మార్చుకోవచ్చు

పోస్టాఫీసులు.. ఆర్‌బిఐ శాఖల్లో మార్పు

ఆర్‌బిఐ కీలక ప్రకటన




2లో

# వైమానిక రవాణా పరిశ్రమలో భారత్ కీలక పాత్ర

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వైమానిక రవాణా పరిశ్రమలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన రంగంలో ప్రముఖ గ్లోబల్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగుతున్న అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం 81వ వార్షిక సాధారణ సమావేశంలో ప్రధానమంత్రి సోమవారంనాడు పాల్గొన్నారు. విమానయాన రంగం, టాలెంట్ ఫర్

టెక్నాలజీ అండ్ ఇన్నొవేటర్స్, ఓపెన్ అండ్ సపోర్టివ్ పాలసీకి ఇండియా మార్కెట్‌లో అవకాశాలు ఉన్నాయని చెప్పారు. విమానయాన రంగంతో పాటు- అంతర్జాతీయ సహకారం, వాతావరణ కట్టుబాట్లు-, సమానమైన వృద్ధి ఎజెండాను ముందుకు తీసుకువెళ్లే వేదికగా ఈ సదస్సు మందుకు సాగాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత విమానయాన రంగంలో ప్రముఖ గ్లోబల్ కంపెనీలు




పెట్టు-బడులు పెట్టేందుకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 42 ఏళ్ల తర్వాత దేశంలో జరుగుతున్న గ్లోబల్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ ఐఏటీఏ వార్షిక సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2030 నాటికి నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ సెగ్మెంట్ పరిమాణాన్ని 4 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యంగా పెట్టు-కున్నట్లు- తెలిపారు. ప్రపంచ వాయు రవాణా పరిశ్రమలో భారత విమానయాన రంగం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ రంగంలో భారీ పెట్టు-బడులకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశీయ పౌర విమానయాన మార్కెట్ భారత్‌దే. భారత్‌ను ప్రపంచం కేవలం విమానయాన మార్కెట్‌గా మాత్రమే కాకుండా వాల్యూ చైన్ లీడర్‌గా చూడాలని కోరుకుంటున్నాం. మా దిశ సరైంది. మా వేగం సరైంది.. అందువల్ల మేం శరవేగంగా ముందుకు దూసుకెళ్లడాన్ని కొనసాగిస్తాంఅన్నారు.

## అభివృద్ధిలో కెసిఆర్..అబద్ధాలో రేవంత్ అగ్రగామి

హైదరాబాద్: అభివృద్ధిలో కేసీఆర్.. అబద్ధాల్లో సీఎం రేవంత్‌రెడ్డి అగ్రగామి అని మాజీ మంత్రి, భారాసఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు రూ.21కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు- సీఎం చెప్పారని.. దాన్ని నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాలు విసిరారు. రూ.21 వేల కోట్ల వడ్డీలేని రుణాలను మహిళలకు

ఇచ్చినట్లు ఆధారం చూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఛాలెంజ్ చేశారు. అలాగే బీఆర్‌ఎస్ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోబోదని.. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒంటరిగానే పోటీచేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వంద సీట్లతో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదన చారి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాతో పాటు- బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు.



అమరవీరులకు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి గారికి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టుకు వెళ్లి బనకచర్ల ప్రాజెక్ట్ ను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే గోదావరి నదిపై బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను వేధిస్తే రెడ్ బుక్‌లో పేర్లు రాసుకుంటామని హరీశ్‌రావు తెలిపారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని.. జాగ్రత్తగా ఉండాలని పోలీసులు, ఇతర ఉన్నతాధికా రులను హెచ్చరించారు. రాష్ట్రంలో 12 వేల కోట్ల ప్రాజెక్టులను కేవలం నలుగురు బడా కాంట్రాక్టర్లకే కట్టబెట్టారని విమర్శించారు. రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉండే ఒక ఎంపీ, ఒక కార్పొరేషన్ చైర్మన్ మిస్ వరల్డ్ ఇంగ్లండ్ కంటెస్టెంట్ మిల్లీ మ్యాగీతో అసభ్యకరంగా ప్రవర్తించారనే వార్తలు వస్తున్నాయని తెలిపారు. దీనిపై వెంటనే సీసీ టీవీ ఫుటేజీ రిలీజ్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టినందుకు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షలు నిర్వహిస్తున్నావా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కట్టారా? ఒక్క చెరువు తవ్వారా అని ప్రశ్నించారు. రైతుబంధు, రైతుబీమా ఎగ్గొట్టారు.. రుణమాఫీ కొంతే చేశారని విమర్శించారు. భాజపాలో భారాస కలుస్తుందని కొందరు మాట్లాడుతున్నారు. భారాస ఎవరితోనూ పొత్తు పెట్టుకోదు.. ఒంటరిగానే అధికారంలోకి వస్తుంది. కేసీఆర్ మొన్ననే కుండబద్ధలు కొట్టి చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా భారాసకు 100 సీట్లు ఖాయం. గోదావరి-బనకచర్లపై భాజపా నేతలు ఎందుకు మాట్లాడట్లేదు? అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లి గోదావరి-బనకచర్లను అడ్డుకుంటాం. అతి చేస్తున్న అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకుని గుణపాఠం చెప్తాం. అందాల పోటీలు నిర్వహించడం చేతగాక రాష్ట్రం పరువు తీశారు. మిస్ ఇంగ్లండ్ చేసిన ఆరోపణలపై సీసీ ఫుటేజీ బయటపెట్టాలని హరీశ్‌రావు అన్నారు.

## రాహుల్‌పై లేనిపోని విమర్శలు

హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి బీజేపీ నేతలపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా రాహుల్ గాంధీపై లేనిపోని విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మీడియాతో మాట్లాడిన ఆయన, దేశ భద్రతపై ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని పరోక్షంగా ఎండగట్టారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పాకిస్తాన్ మిలిటెంట్లు- దేశంలోకి చొరబడి 26 మందిని కాల్చి చంపారని, కాశ్మీర్‌లోని పార్క్‌లో ఉగ్రవాదులు హింస సృష్టించేసరికి కేంద్ర ఇంటలిజెన్స్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. దేశంలో ఇటు-వంటి ఘటనలు జరుగుతుంటే ప్రధాని మోదీ రాహుల్ గాంధీ అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోగా, బీజేపీ నేతలు విమర్శలకు పాల్పడటం దుర్మార్గమని చెప్పారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లాంటి నేతలు రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మీరు నిద్రలో ఉండి విమర్శలు చేస్తే

మేము చూస్తూ ఊరుకోం అంటూ హెచ్చరించారు. తప్పులు మీరు చేస్తే, ప్రతిపక్ష నాయకుడిపై నింద వేయడం సరికాదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో తలెత్తిన ఉద్రిక్తతల సమయంలో దేశ ప్రజలు ప్రధానమంత్రి మోడీ యుద్ధం చేస్తారని భావించారని జగ్గారెడ్డి అన్నారు. కానీ అకస్మాత్తుగా యుద్ధం ఆగిపోయిందని, ఈ ప్రకటనను మోదీ కాకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేయడం విచారకరమని మండిపడ్డారు. దేశప్రజలకి యుద్ధం ఆగిందని మోదీ చెప్పాల్సినప్పుడు ట్రంప్ చెప్పడమేంటో అంటూ ప్రశ్నించారు. ఇదే సందర్భంలో ఇందిరాగాంధీ అధికారంలో ఉన్న సమయంలో అమెరికా జోక్యాన్ని ఎలా తిరస్కరించిందో గుర్తు చేశారు. వాజ్‌పాయి జన్మదినం రోజున ప్రధాని మోదీ పాకిస్తాన్ వెళ్లడం, అక్కడ నవాజ్ షరీఫ్ తల్లి కాళ్లను మొక్కడం వంటి సంఘటనలను జగ్గారెడ్డి గుర్తుచేశారు. ఇలాంటి సమయంలో మేమేంటన్నట్లు రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం సరైంది కాదఅని బీజేపీ నేతలను ఉద్దేశించి అన్నారు. బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై రాహుల్ గాంధీ వేసే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని, లేకపోతే విమర్శలు చేయడం మానుకోవాలి. వాస్తవాలు వెలికి తీయడమే కాంగ్రెస్ బాధ్యత. దాన్ని తప్పుగా చిత్రీకరించబోద్దని ఆయన వ్యాఖ్యానించారు.

## ఒక్కో వ్యవస్థను చక్కదిద్దుతూ వస్తున్నాం

హైదరాబాద్: తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి అడుగులు వేస్తున్నామని, ప్రపంచంలోనే తెలంగాణను అగ్రభాగాన నిలబెట్టే ప్రయత్నంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. కట్టుబానిసత్వాన్ని, వెట్టిచాకిరీని తెలంగాణ సమాజం సహించదు. అందుకే ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆలోచనలే మా ఆచరణగా ముందుకు వెళ్తున్నాం అన్నారు. గత పదేళ్లలో నిర్వీర్యమైన వ్యవస్థలను ఒక్కొక్కటిగా చక్కదిద్దుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ అజెండా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాము బాధ్యతలు చేపట్టేనాటికి ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని చెప్పారు. పదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైన వ్యవస్థలను చక్కదిద్దుతున్నామన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రావతరణ వేడుకల శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాల పోరాటంతో తెలంగాణను సాధించుకున్నామని ఉద్ఘాటించారు. ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యఅతిథిగా జపాన్‌లోని కితాక్యూషూ సిటీ మేయర్ టేకుచి పాల్గొన్నారు. దేశాన్ని 30 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడం లో తెలంగాణను అగ్రభాగాన నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అందుకే తెలంగాణ రైజింగ్-2047 భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నాం. వచ్చే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిద్దాలని నిర్ణయించాం. 2047



నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. తెలంగాణ రైజింగ్ మనల్ని నడిపించే మంత్రం. 2047నాటికి దేశంలోనే కాదు, ప్రపంచంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. పారదర్శక పరిపాలనతో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజా ప్రభుత్వానికి మీరంతా అండగా ఉంటారని ఆశిస్తున్నానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. సకల జనుల ఆకాంక్షలు నెరవేరిన రోజు తెలంగాణ ఆవిర్భావమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రాన్ని పునర్నిర్మించే దిశగా

అడుగులు వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రం వచ్చి పదేళ్లయినా ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి.. ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాము అధికారం చేపట్టే నాటికి వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం.. విద్యార్థులు,యువకులు, ఉద్యోగులు, మహిళలు, మేధావులు, కవులు, కళాకారులు, సకలజనులు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చుకున్న రోజు... ఇది మనందరం గర్వించదగిన రోజు. ఈ సందర్భంగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు నా శు భాకాంక్షలు తెలియజేస్తున్నా... ఈ రోజు రాష్ట్ర ప్రజల కలను నిజం చేసిన శ్రీమతి సోనియా గాంధీగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ తెలంగాణ అమర వీరులకు ఘన నివాళులు అర్పిస్తున్నా..స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం దశాబ్దాలుగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నం. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. అందుకే పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు-చేసుకున్నారు. డిసెంబర్ 7, 2023న మేం బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నం మొదలు పెట్టాం. మేం బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. జరిగిన తప్పిదాలను సరిదిద్ది రాష్ట్రాన్ని గాడిన పెట్టాల్సిన బాధ్యత మాపై ఉంది. ఇది నల్లేరుపై నడక కాదని మాకు తెలుసు. అయినా ప్రజల ఆకాంక్షలనే ప్రజా ప్రభుత్వ ఎజెండాగా తెలంగాణ పునర్నిర్మాణం దిశగా ప్రయత్నిస్తూ ముందుకు కదిలాం అని వివరించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే తమ ప్రభుత్వం లక్ష్యమని వ్యాఖ్యానించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆడబిడ్డలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు

**హైదరాబాద్:** గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. నోటీసులు కాదు.. దమ్మ్ముంటే సస్పెండ్ చేయండంటూ పార్టీ అధిష్టానానికి ఆయన సవాల్ విసిరారు. పార్టీ అధిష్టానం నోటీసులు జారీ చేస్తుందంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రాజా సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ హద్దులను అతిక్రమించడంతో ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకునేందుకు అటు- జాతీయ, ఇటు రాష్ట్ర పార్టీ నాయకత్వం సిద్ధమైంది. గత కొద్ది రోజులుగా పార్టీపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర అసంతృప్తిని వినిపిస్తున్నారు. దీంతో ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనేందుకు జాతీయ నాయకత్వం సిద్ధమైంది. అందులోభాగంగా రాష్ట్ర నాయకత్వానికి కీలక సూచనలు చేసింది. దాంతో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు- తెలుస్తోంది. ఇదే విషయం అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ క్రమంలో ఎమ్మెల్యే రాజా సింగ్ సోమవారం కాస్తా ఘాటుగానే ప్రతిస్పందించారు. తనకు నోటీసులు ఇవ్వడమేంటి.. దమ్ముంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయడంటూ పార్టీ అధిష్టానానికి సూటిగా సవాల్ విసిరారు.రాష్ట్రంలోని పలువురు సీనియర్లపై ఎమ్మెల్యే రాజాసింగ్ వరుసగా కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. దీంతో ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వం దృష్టికి రాష్ట్ర నాయకత్వం తీసుకు వెళ్లింది. దీంతో కేంద్ర నాయకత్వం రాజాసింగ్‌పై దృష్టి సారించింది. అందులోభాగంగా అతడికి నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు- సమాచారం.

## 2వేల నోట్లు ఉంటే మార్చుకోవచ్చు

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 2000 నోట్ల గురించి కీలక ప్రకటన చేసింది. వీటిని మే 19, 2023న ఉపసంహరించాలని నిర్ణయించినప్పటికీ, రెండేళ్ల తర్వాత కూడా ప్రస్తుతం రూ. 6,181 కోట్ల విలువైన నోట్లు ఇంకా ప్రజల వద్ద ఉన్నాయని ఆర్బీఐ డేటా సోమవారం తెలిపింది. ఈ నోట్లు- ఇప్పటికీ చెల్లుబాటు- అవుతాయని, అంటే వాటిని లావాదేవీల కోసం ఉపయోగించవచ్చని స్పష్టం చేసింది.




2023లో వీటి రద్దు నిర్ణయం ప్రకటించినప్పుడు మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువైన రూ. 2000 నోట్లు- చలామణిలో ఉన్నాయి. ఆ తర్వాత 2025 మే 31 నాటికి ఈ మొత్తం గణనీయంగా తగ్గి కేవలం రూ. 6,181 కోట్లకు చేరింది. అంటే, 98.26 శాతం నోట్లు మాత్రమే ఇప్పటికీ బ్యాంకింగ్ వ్యవస్థకు తిరిగి చేరాయి. మిగిలిన ఆరు వేల కోట్లు ఇంకా ప్రజల వద్దనే ఉన్నాయి. మిగిలిన రూ. 2000 నోట్లను సాధారణ బ్యాంక్ బ్రాంచ్‌లలో డిపాజిట్ చేయడం లేదా మార్చుకోవడం 2023 అక్టోబర్ 7తో ముగిసింది. దేశంలో గడచిన కొన్ని సంవత్సరాలుగా చలామణిలో ఉన్న రూ.2 వేల నోట్లు- దశలవారీగా మార్కెట్ నుంచి తొలగించబడు తున్నాయి. ఇప్పటికే ఎక్కువ శాతం నోట్లను ప్రజలు బ్యాంకుల ద్వారా తిరిగి ఇచ్చారు. అయితే తాజాగా ఈ పక్రియకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్బీఐ తెలిపిన వివరాల ప్రకారం, ఇప్పటి వరకు తిరిగి వచ్చిన రూ.2 వేల నోట్ల పరిమాణం 98.26 శాతానికి చేరింది. ఈ నోట్లను మార్చుకోవ డానికి ప్రజలు ఎంపిక చేసిన పోస్టాఫీసులు లేదా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాలను సంప్రదించవచ్చని ఆర్బీఐ వెల్లడించింది.

## విద్యారంగ పటిష్టత..నీటిమీద రాతలు !

ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యం కారణంగా విద్యారంగం కుదేలవుతోంది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి నెలకొంది. విద్యలో తెలుగు రాష్ట్రాలు వెనకబడి పోవడానికి సరైన దృక్పథం, చిత్తశుద్ధి లేకపోవడంగా చూడాలి. ప్రభుత్వ విద్యారంగం పటిష్టత పేరుతో ఏళ్లుగా కబుర్లు చెప్పి కాలయాపన చేస్తున్నారు. అలాగే ఉపాధ్యాయుల కొరత, పదోన్నతులు వంటి సమస్యలు తీర్చాల్సిందే. ఈ దశలో విద్యారంగం పటిష్టత కోసం గతంలో చేసిన హామీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కెజి టూ పిజి అన్న ప్రతిపాదన కోల్డ్ స్టోరేజీకి వెళ్లింది. స్కూళ్లకు సరైన వసతులు ఉండవు. టీచర్ల సంగతి సరేసరి. ఉపాధ్యాయులు లేక నేటికీ తెరవని పాఠశాలలు కోకొల్లలు. గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయులు లేక అనేక స్కూళ్లు మూతపడి వున్నాయి. ఏటా కనిపిస్తున్న దృశ్యాలే ఇవి. ఇకపోతే జూన్ మాసం వచ్చిందంటే తల్లిదండ్రులు గుండోల్లో దడ పట్టుకుంటుంది. పిల్లకు స్కూళ్లు తెరిచేనాటికి ఫీజులు, పుస్తకాలు, షూస్ ఇలా రకరకాల ఖర్చులు తడిసిమోపెడు అవుతుంటాయి. ప్రభుత్వ స్కూళ్లలో భరోసా లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు అప్పుల చేసి పిల్లలను ప్రైవేట్ స్కూళ్లల్లో చేర్పిస్తున్నారు. అందుకే ఏటా పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబ సభ్యులకు జూన్ నెల భయం పట్టుకుంటుంది. భరించలేని ఫీజుల భారాలు, పుస్తకాలు, యూనిఫాం ఖర్చులన్నీ ఒకే సారి వస్తాయి. నోట్ల కట్టలను కట్టగట్టి పిల్లలను పాఠశాలలకు పంపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి సెలవులు ముగింపు దశకు వచ్చేశాయి. మరో వారం రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ప్రయివేటు పాఠశాలలు తెరుస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసేస్తున్నారు. పుస్తకాలు వచ్చాయని, వెంటనే తీసుకోవాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లుమీద ఫోన్లు చేస్తున్నారు. ముందస్తు ఫీజులు, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. కొత్త ఏడాది పిల్లల్ని పాఠశాలలకు పంపాలంటే ఇద్దరు విద్యార్థులు ఉన్న కుటుంబంలో ప్రయివేటు పాఠశాల అయితే రూ.50వేలు, కార్పొరేట్ పాఠశాల అయతే రూ.లక్షకు పైగా ఖర్చు చేయాల్సి ఉంది. ఫీజుల మోతతో తల్లిదండ్రులపై మోయలేని భారం పడుతోంది. హైదరాబాద్ లాంటి నగరంలో పిల్లవాడికి కనీసం 2 నుంచి 3 లక్షల వరకు ఖర్చు అవుతోంది. యూనిఫామ్, పుస్తకాలు, తదితరాలు మళ్లీ అదనమని గుర్తించాలి. గిరిజన గ్రామాలకు నేటికీ రవాణా సౌకర్యం లేదు. వారికి కరెంట్ అంటే ఏమిటో తెలియదు. విద్య,వైద్యం వారి దరికి చేరడం లేదు. కొన్నిచోట్ల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు, లెక్కలు, భౌతిక శాస్త్రం, సామాన్య శాస్త్రాలకు స్జబెక్టు టీచర్లు లేరు. రాష్ట్రం లోని కొన్ని వేల స్కూళ్లు 5 తరగతులకు కలిపి ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయి. ఇకపోతే ఎపిలో ఇంగ్లీషు మాధ్యమంతో ముందుకు పోదామని గత ప్రభుత్వం ప్రయత్నించి విఫలమయ్యింది. తెలుగు మీడియం ఎందుకు వద్దని అడిగితే పేదలకు ఇంగ్లీషు వద్దా అన్న చర్చ సాగింది. అదీలేదు...ఇదీ లేదన్నట్లుగా రెంటికి చెడ్డ రేవడిలా విద్యారంగం తయారయ్యింది. ముఖ్యంగా ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై నియంత్రణ లేకుండా పోయింది. ప్రభుత్వ స్కూళ్లు బలపడితే ప్రైవేట్ దోపిడీ తగ్గుతుందన్న కనీస జ్ఞానం లేకుండా పాలకులు ఉన్నారు. నాయకుల పిల్లలు ఇంగ్లీషులో చదువుకుంటుంటే పేదల పిల్లలు చదువు కోకూడదా? అన్న మౌళిక ప్రశ్నలు వచ్చాయి. డబ్బున్న వాళ్ళు లక్షల రూపాయలు పోసి ఇంగ్లీషులో చదువుకోగా, పేదలకు ప్రభుత్వం ఉచితంగా ఇంగ్లీషు చదువు చెప్పడం తప్పా? అన్న వారు ఏ పనీ చేయకుండానే పోయారు. నిజానికి ఇంగ్లీషు మాధ్యమం పెట్టడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. తెలుగు మాధ్యమాన్ని రద్దు చేయొద్దనే అడుగుతున్నారు. అయితే ఇంగ్లీష్ మీడియం ప్రకటించడానికి ముందు ఆ మేరకు స్కూళ్లను, తయారు చేసి టీచర్లను నియమించాల్సి ఉంది. ప్రకటనలు బాగున్నా ఆచరణలో పక్కా ప్రణాళిక ఉండాలి. మాధ్యమం గొడవ పక్కన పెట్టి పిల్లలందరికి విద్యను చేరువ చేసే కార్యక్రమం జరగాలి. ఏ ఒక్క పిల్లవాడు బడిబయట ఉండకుండా చూడాలి. అప్పుడు తెలుగా, ఇంగ్లీషా అన్న తర్కం చేయవచ్చు. మాతృభాష ద్వారానే జాతి సంస్కృతి, సాంప్రదాయాలు నిలబడతాయని అందరి అభిప్రాయం. నిపుణులు మాతృభాషా బోధనే మేలంటున్నారు. ఇంగ్లీష్ నేర్పడం వేరు. బోధన వేరని అభిప్రాయంగా ఉంది. రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, వికాసానికి సంబంధించిన ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత పరిశోధనలు పరిగణలోకి తీసుకోవాలి. భాషా శాస్త్రవేత్తలు, సంఘాలు, రాజకీయ పార్టీలతో సంప్రదించాలి, చర్చించాలి. అతి చిన్న దేశాలు మొదలు అతి పెద్ద జనాభాగల చైనా వరకు అన్ని దేశాలూ వారి మాతృభాష లోనే ప్రాథమిక విద్య బోధిస్తున్నాయి. కొన్ని దేశాలు పి.జి వరకు మాతృభాషనే వాడుకుంటున్నాయి. జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా అత్యంత అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాష మాధ్యమంలోనే నడుస్తున్నాయి. చిన్న దేశమైన క్యూబా మాతృభాష లోనే వైద్యంలో అద్భుతాలు సాధించింది. మన దేశంలో అన్ని రాష్ట్రాలు వారి భాషా మాధ్యమంలో విద్యను కొనసాగిస్తు న్నాయి. విద్యలో దేశంలోనే కేరళ ముందున్నది. అది కూడా మాతృభాష లోనే ప్రాథమిక విద్యను అందిస్తున్నది. కేరళ ప్రజలే ఎక్కువగా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

ఉత్తేజిత దినపత్రిక



# శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలకు వైభవంగా ధ్వజారోహణం





**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,జూన్ 02.**

తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం 07.02 – 07.20 గంటల మధ్య మిథున లగ్నంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీవారి ఆస్థానం ఘనంగా జరిగింది. అంతకుముందు శ్రీగోవిందరాజస్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఈ ఊరేగింపు ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ఒకమారు ముందుగా పర్యవేక్షిస్తారని ప్రతీతి. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. మిథున లగ్నంలో శ్రీ గోవిందరాజస్వామి వారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఎన్ని దానాలు చేసినా ధ్వజారోహణకార్యంలో గరుడారోహణం చేసిన పుణ్యంతో సాటిరాదని పురాణాలు చెబుతున్నాయి. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. సమాజశ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుంది.

**బ్రహ్మోత్సవాలకు టిటిడి ఏర్పాట్లు:**

శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా టిటిడి ఏర్పాట్లు చేపట్టింది. మూలవిరాట్ తోపాటు వాహనసేవలను భక్తులు సంతృప్తిగా దర్శించుకునేందుకు వీలుగా విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టారు. ప్రధానంగా జూన్ 06న గరుడ వాహనం, జూన్ 09న రథోత్సవం, జూన్ 10న చక్రస్నానం జరుగనున్నాయి. వాహనసేవల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులతో సమన్వయం చేసుకునేలా చర్యలు చేపట్టారు. వాహనసేవలను భక్తులు తిలకించేందుకు వీలుగా రైల్వేస్టేషన్, విష్ణునివాసం, గోవిందరాజస్వామి పుష్కరిణి ప్రాంతాల్లో డిజిటల్ స్క్రీన్లు(ఎల్ఇడి)లు ఏర్పాటు చేశారు. ఆలయం, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. క్యూలైన్ల క్రమబద్ధీకరణ కోసం తగినంత మంది శ్రీవారి సేవకులను కేటాయించారు. భక్తులకు అన్నప్రసాదాలు, వాహన సేవల్లో మజ్జిగ, తాగునీరు పంపిణీకి ఏర్పాట్లు చేశారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో వాహనసేవల ముందు ఆకట్టుకునేలా నిపుణులైన కళాకారులతో భజనలు, కోలాటాలు, ఇతర సాంస్క తిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఉత్సవాల్లో మొదటిరోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 10 నుండి 11 గంటల వరకు కల్యాణమండపంలో స్నపనతిరుమంజనం వేడుకగా జరుగనుంది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పలు రకాల పండ్లరసాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేస్తారు.

సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహన సేవ జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు రాత్రి 07 గంటల నుండి 9.00 గంటల వరకు పెద్దశేషవాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు.

**పెద్ద శేష వాహనం విశిష్టత:**

పెద్ద శేషుడు ఏడుకొండలకు, ఏడులోకాలకు సంకేతంగా ఏడుపడగలు గల ఆదిశేషుడు. వాహనరూపంలో శ్రీగోవిందరాజ స్వామిని స్తుతిస్తూ, స్వామికి మంచం, పరుపు, ఛత్రం మూడూ తానే అయి 'శేషశాయి' అనే పేరును సార్థకం చేస్తున్నాడు. శ్రీవారికి విశ్రాంతికీ, సుఖనిద్రకూ కారణమవుతున్నాడు. తనను, శేషుణ్ణి దర్శించే భక్తుల్ని కాపాడుతానని, మీరందరూ శేషుని వలె నాకు నిత్యసేవకులుగా ఉండి సత్ఫలాలు పొందాలని ఈ వాహనసేవ ద్వారా స్వామివారు ప్రబోధిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, డెప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్.శాంతి , ఏఈవో శ్రీ కె.మునికృష్ణారెడ్డి , శ్రీవారి సేవకులు ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నకిలీ ఇంటి పట్టాలు రద్దు చేయాలి... వామపక్ష పార్టీల డిమాండ్.



**పేదలకు ఇంటి పట్టా పక్కా గృహాలు మంజూరు చేయాలి.**

**మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం అందజేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు.**

**నందికొట్కూరు : జూన్: 2:(ఉత్తేజిత ప్రతినిధి):**

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని నూతనంగా వెలిసిన పట్టణ శివారు కాలనీలో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు అందజేయకపోవడంతో నకిలీ పట్టాలకు అడ్డగా మారాయని వాటిని అడ్డుకొని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పక్కా గృహాలు మంజూరు చేయాలని సిపిఐ ఎంఎల్( లిబరేషన్) ఎం సిపిఐ (యు )పార్టీ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, పాతకోట లాజరస్ లు సోమవారం నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కర్నూల్ రోడ్డులో గల బైరెడ్డి నగర్ లో కొన్ని ఏళ్లుగా ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలాలు పేదలు ఆక్రమించుకొని నివాస గృహాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని వారు తెలిపారు. అప్పట్లో నివాస గృహాలు ఏర్పాటు చేసుకున్న కమ్యూనిస్టు సానుభూతిపరులపై కేసులు నమోదు చేసిన ,కోర్టులకు తిప్పడం జరిగింద నీ వారు గుర్తు చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం కోర్టు కేసులు కొట్టివేస్తూ అర్హులైన పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అప్పటి తాసిల్దార్ త్రినాథ్ కుమార్ ని జడ్జి ఆదేశించడం జరిగిందన్నారు. కోర్టు తీర్పు ఇచ్చి పదకొండు సంవత్స రాలు అయినా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో. నకిలీ పట్టాలతో కొందరు సొమ్ము చేసుకుంటున్నారని వారు తెలిపారు. ఉన్నవారికి ప్రభుత్వ ఇంటి పట్టాలు నకిలీవి సృష్టించి ఇస్తున్నారని పేదలకు అన్యాయం చేస్తున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంపీలకు ఎమ్మార్వో అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన ,పోరాటాలు చేసిన ఫలితం లేకపోయిందని వారు అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బైరెడ్డి నగర్ లో గుడిసెలు వేసుకున్న అర్హులైన పేదలకు పట్టాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ విషయంపై స్పందించి వెంటనే జిల్లా కలెక్టర్ ను నకిలీ పట్టాల పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇల్లు లేని పేదలకు పక్కా ఇల్లు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు అందే వరకు కమ్యూనిస్టు పార్టీలు చేసే పోరాటాలకు అండగా ఉంటానని చైర్మన్ హామీ ఇవ్వడం జరిగిందని వెంకటేశ్వర్లు లాజరస్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ (లిబరేషన్ )పార్టీ నాయకురాలు ఎస్ బి బి, కాటే పోగు సామన్న ,రామకృష్ణ, గుడిసె వాసులు శాంతమ్మ ,రోజమ్మ , విశ్రాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 299 అర్జీలు

**ఆర్జీల పరిష్కారానికి మానవతాదృక్పదంతో వ్యవహరించాలి**

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జి ఆర్ ఎస్ ) ద్వారా ప్రజల నుండి అందే ప్రతి అర్జీలకు నాణ్యతగా గడువు లోపు పరిష్కారం చూపాలి : జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, జూన్ 2**

: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పదంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు.

సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయమునకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణంలో వారు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, త్రాగునీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు వచ్చిన అర్జీదారులకు అందించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధా రాణి, రోజ్ మా%శీ%డ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులు అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు : రెవెన్యూ -158, పంచాయతీ రాజ్ -23, వాటర్ రిసోర్సెస్ -2, పోలీస్ శాఖ - 15, సాంఘిక సంక్షేమ శాఖ-1, రూరల్ పావర్టీ -13, రూరల్ డెవలప్మెంట్ -2, సివిల్ సప్లై - 15, విద్యా శాఖ -4, ఎస్ ఎస్ ఎల్ ఆర్ -16, ఏపీఎస్పీడిసిఎల్ -8, ఏపిఎస్డబ్ల్యుఆర్ఐఈఎస్-7, ఎంప్లాయ్ మెంట్ %డ% ట్రైనింగ్ -1, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్-12, దేవాదాయ శాఖ -2, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి -1, పబ్లిక్ హెల్త్ -3, మెడికల్ ఎడ్యుకేషన్ - 1, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ -3, జిఎస్ డబ్ల్యు ఎస్-2, రిజిస్ట్రేషన్ %డ% స్టాంప్స్ -4, ఏపి స్టేట్ క్రిస్టియన్ మైనారిటీస్ - 1, అటవీ శాఖ-2, ఏపి స్టేట్ ఇరిగేశన్-1, కార్మిక శాఖ -1, వికలాంగులువయో వృద్ధుల శాఖ -1 వెరసి మొత్తం 299 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరూ వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# పాములపాడు రేషన్ డీలర్లు గ్రామ సర్పంచ్ కు పిలవకుండా బియ్యం పంపిణీ

**వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి** గ్రామ సర్పంచ్ మేకల.భాగ్యమ్మ



ఉత్తేజిత (శ్రీశైలం ప్రతినిధి,) జూన్ 2వ .తేదీన నంద్యాల జిల్లా మండల కేంద్రమైన పాములపాడు గ్రామంలో. రేషన్ డీలర్లు జూన్ -1వ తేదీన ఫోటో కాల్ ప్రకారం గ్రామ సర్పంచ్ కు పిలుపునివ్వకుండా బియ్యం, సరుకులు పంపిణీ చేశారని, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాములపాడు గ్రామ సర్పంచ్ మేకల.భాగ్యమ్మ సోమవారం ఎమ్మార్వో ఆఫీస్ లో స్పందన(గ్రీవెన్స్) కార్యక్రమంలో పాములపాడు తహసిల్దార్-జి.సుభద్రమ్మకు పాములపాడు సర్పంచ్ మేకల భాగ్యమ్మ తన కుమారులు మేకల.రాజశేఖర్, మేకల.విజయ్ కుమార్ లతో కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా పాములపాడు గ్రామ సర్పంచ్ మేకల.భాగ్యమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇంటింటి వాహనాలు రద్దుచేసి, ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రేషన్ డీలర్ల చౌక దుకాణాల ద్వారా ప్రజలు సరుకులు నెలలో ఎప్పుడు వెళ్లినా కూడా తీసుకోవడానికి వీలుగా మార్చడం జరిగిందని అన్నారు. జూన్ ఒకటవ తేదీ గ్రామ సర్పంచుల ద్వారా, ఎమ్మెల్యేల ద్వారా, అధికారుల ద్వారా ప్రారంభోత్సవం చేయాలని ఉత్తర్వులు ఉన్నా కూడా, ఆ ఉత్తర్వులను దిక్కరించి పాములపాడు డీలర్లు వాళ్లే పంపిణీ చేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. నేను కేవలము దళిత సర్పంచును కాబట్టి నా మీద వాళ్లు వివక్ష చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. నందికొట్కూరు నియోజవర్గంలోని, అన్ని మండలంలో ఉన్న గ్రామాలలో డీలర్లు సర్పంచుల ద్వారా ప్రారంభం చేస్తే, ఇక్కడ మండల కేంద్రంలో ఆయన పాములపాడు లో . సర్పంచును పిలవకుండా ప్రోటోకాల్ ను. ధిక్కరించారని, కనుక వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాన్ని, అధికారులను కోరుచున్నానని అన్నారు. పాములపాడు మండల తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ - డి.ఖాజాబి, సర్వేయర్లు, వీఆర్వోలు, తదితర సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# జనసేన 5 లక్షల బీమా చెక్కుల అందజేత

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు జూన్ 2**



ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు నియోజకవర్గం లో గల మిడుతూరు మండలంలోని అలగనూరు గ్రామానికి చెందిన తప్పెట శివశంకర్ ప్రమాదవశాత్తు మరణించగా జనసేన పార్టీలో అతనికి క్రియాశీలక సభ్యత్వం ఉన్నందున నందికొట్కూరు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయ బాధ్యులు నల్లమల రవికుమార్ ఆ యొక్క విషయాన్ని పార్టీకి తెలియజేసి ఆ కుటుంబానికి భరోసాగా పార్టీ తరపున 5 లక్షల రూపాయల చెక్కు తప్పేట శివశంకర్ సతీమణి అయినటువంటి నాగదేవి కి జనసేన పార్టీ ఎమ్మెల్సీ శ్రీ కొణిదెల నాగేంద్ర బాబు మరియు శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో వారి చేతుల మీదుగా ఇప్పించడం జరిగింది.

ఈ యొక్క కార్యక్రమంలో చెరుకుచెర్ల గ్రామానికి చెందినటువంటి పానుగంటి ప్రతాప్ కృషి కూడా ఉంది. ఆ యొక్క కుటుంబ వివరాలు సేకరించి పార్టీకి మరియు నల్లమల రవికుమార్ కు అందించి అతని బాధ్యతగా సహకరించడం జరిగింది.

ఈ యొక్క సందర్భంగా సమన్వయ బాధ్యులు నల్లమల రవికుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ద్వారా కుటుంబ పెద్ద లేకపోతే ఆ కుటుంబం ఇబ్బందుల బారిన పడకుండా ఉండటానికి పార్టీ వినూత్నంగా ఆలోచించి ఈ యొక్క 5 లక్షల రూపాయల బీమా ఆ కుటుంబానికి చెందే లాగున ఆలోచించడం,అమలు చేయడం చాలా ఆనందకరమన్నారు. అలాగే పార్టీ అధికారంలో ఉన్న లేకపోయినా ఈ బీమా డబ్బులు క్రియాశీలక సభ్యులకు అందజేయడం జనసేన పార్టీ ప్రత్యేకత అని తెలియజేశారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 23 వినతులు.

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, జూన్ 02.**




తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 23 వినతులు వచ్చాయని కమిషనర్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా నలుగురు తమ సమస్యలు తెలుపగా, 19 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. బక్రీద్ కు ఈద్గా మైదానంలో ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ ఎస్.కి.బాబు కోరారు. కాగా ఎస్.ఎల్.వి.నగర్ నందు అక్రమ నిర్మాణాలు అరికట్టాలని, 6,7 వార్డుల్లో మెప్మా సంఘాలు జరిపేందుకు గదులు కేటాయించాలని, కె.బి.లే ఔట్ నందు ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని, యు డి ఎస్ ఓవర్ ఫ్లో అరికట్టాలని, టిడిఆర్ ఇప్పించాలని, ఎమ్మార్ పల్లి 80 అడుగుల రోడ్డులో రోడ్డుపై వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించాలని, గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్ వద్ద రోడ్డుపై వాహనాలు ఆపుతున్నారని, ఉప్పంగి హరిజనవాడలో ఆక్రమణలు అరికట్టాలని కోరారని తెలిపారు. ఆయా సమస్యలను విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఫైర్ డి.ఈ.లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

ఉత్తేజిత దినపత్రిక

# కాంగ్రెస్ తీరుమార్చుకోవాలి !

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పయనం అగమ్యగోచరంగా ఉంది. ముఖ్యంగా ఎపిలో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అక్కడ ఎవరు వచ్చినా ఆ పార్టీ బతికి బట్టకట్టడం కష్టం. గత ఎన్నికలకు ముందు షర్మిల పగ్గాలు చేపట్టినా పెద్దగా లాభం లేకుండా పోయింది. చివరకు ఆమె కూడా గెలవలేదు. వైఎస్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో జగన్ సఫలమైనా..పాలనలో విఫలం అయ్యారు. స్వార్థపూరిత రాజకీయాలు జగన్ పతనాన్ని శాసించాయి. ఇప్పుడు షర్మిల పోరాటం వల్ల జగన్‌కు నష్టం జరగిందే తప్ప కాంగ్రెస్‌కు లబ్ది చేకూరలేదు. తెలంగాణలో బిజెపికి దక్కాల్సిన అధికారం అనూహ్యంగా కాంగ్రెస్‌కు దక్కింది. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక చేస్తున్న కార్యక్రమాలు కొంతమేరే ఫలితం ఇచ్చినా, సమర్థ నేతగా రుజువు చేసుకోలేక పోతున్నారు. బహునాయకత్వం, ప్రతిదానికీ హైకామండ్ ముందు మోకరిల్లాల్సి రావడం వంటి కారణాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో పలచనవుతోంది. మంత్రులతంతా ఎవరికివారు యమునా తీరే అన్నట్లుగా ఉంటున్నారు. తమ శాఖల పరిధిలోని కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయలేక పోతున్నారు. దేవాయదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు ఈ రెండు శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడం లేదు. అడవుల పెంపకం లేదు. కోతులు గ్రామాలను పట్టిపీడిస్తున్నా పట్టించుకోవడం లేదు. దేవాలయ భూముల చెరను విడిపించలేకపోతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలకే పరిమితం అయ్యారు. ఎక్కడా రోడ్ల అభివృద్ధి జరగడం లేదు. రాజధాని హైదరాబాద్ అంతర్గత రోడ్లు ఏడాది దాటినా అభివృద్ధిక నోచలేదు. గ్రామాల్లో నిధులు విడుదల కాకపోవడంతో పనులు పడకేశాయి. ఇలా ఒక్కోమంత్రి తీరు ఒక్కోలా ఉంది. శాఖల్లో పనులు సక్రమంగా సాగడం లేదు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోదు.. ప్రతిపక్షంలో ఉంటే విపక్షంగా గట్టి పాత్ర నిర్వహించదు. అధికారం కోసం వెంపర్లాడడం తప్ప అణగిమణిగి ఉండాలన్న ఆకాంక్ష కానరాదు. పార్టీని బలోపేతం చేయడం కోసం ఎవరూ పాటుపడరు. పాటుపడేందుకు ఎవరైనా ముందుకు వస్తే కాళ్లు లాగేస్తుంటారు. అధికారం వస్తే పదవుల కోసం పాకులాడుతారు. అధికారం లేకుంటే కీచులాటతో పార్టీని భ్రష్టు పట్టిస్తుంటారు. మొత్తంగా కాంగ్రెస్‌లో ఒకరిపై ఒకరికి విశ్వాసం ఉండదు. నాయకత్వాన్ని సహించే లక్షణం లేదు. నాయకుడు ఎవరైనా కాళ్ళల్లో కట్టెలు పెట్టడం అలవాటు. అలా పార్టీకిచేటు జరుగుతున్నా పట్టించుకోరు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఇదే ధోరణి కనిపిస్తోంది. బిఆర్ఎస్, బిజెపిలు చేస్తున్న విమర్శలను సమర్థంగా తిప్పికొట్టలేక పోతున్నారు. హైదరాబాద్ భూముల విషయంలో వీరి వాదన పేలవంగా ఉంది. నిజానికి భూమిని కోర్టులో పోరాడి దక్కించుకుంటే దానిని రక్షించాలి తప్ప అమ్మరాదు. సన్నబియ్య, పెన్షన్ల పేరుతో దుబారా చేసే బదులు దుబారాకు కళ్లెం వేయాలి.ప్రస్తుత కాంగ్రెస్ నేతలు ఎవరికి వారే అధికార కూటమిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది నిజంగా ఆత్మహత్య సదృశ్యమే. ఇలా జాతీయ స్థాయిలోనూ కనిపిస్తాయి. అధికారంలో ఉంటే కళ్లు నెత్తికెక్కుతాయి. పార్టీలో ఎవరైనా పెత్తనం చెలాయిస్తారని భావిస్తే అలాంటి వారిని అసలు చేరకుండా అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. పార్టీపరంగా రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉంటారే తప్ప పరిష్కారనికి ముందుకు రారు. జాతీయస్థాయిలో అయినా.. రాష్ట్రస్థాయిలో అయినా ఇదే పరిస్థితి ఉంటుంది. తాజాగా తెలంగాణలో జరుగుతున్న పరిస్థితులు కూడా ఇందుకు భిన్నం కాదు. రేవంత సిఎంగా ముందుకు నడుస్తున్న వేళ..పటిష్ట నిర్ణయాలపై చర్చించడం లేదు. సమస్యలను చర్చించి పరిష్కరించే చర్యలు కానరావడం లేదు. ఉమ్మడిగా పినచేయడం లేదు. కేవలం రేవంత్ మాత్రమే అందరినీ కలుపుకుని పోయేలా ఉంటున్నారు. పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కూడా పెద్దగా పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నాలు చేయడం లేదు. పార్టీ పరువు పోయినా, ఉన్న వారు బయటకు పోతున్నా.. ఉన్నవారు మాత్రం బింకాన్ని వదలకుండా తమకోసం పోరాడుతారు. తెలంగాణలోని పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా ఈ జాడ్యం పట్టుకుంది. పార్టీలో వ్యతిరేకంగా పనిచేయడం పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా పరిగణించి..రేవంత్ రెడ్డికి పూర్తి అధికారం ఇచ్చి నడిపించడం లేదు. ఎందుకంటే రాజకీయాలు చేయడం అక్కడే మొదల వుతోంది. అధిష్టానం కర్నాటక, తెలంగాణలను పిండేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ భూముల అమ్మకం వెనకా ఒత్తిళ్లు ఉన్నాయని అంటున్నారు. కేంద్రంలో బీజేపీ బలహీన పడితే, ఆ పరిస్థితి ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే లాభిస్తుంది. కొన్ని రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ ఎదురెదురు నిలిచి ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో బీజేపీ బలహీన పడితే కాంగ్రెస్ కొంత లబ్ధి పొందవచ్చు. బీజేపీ ఎంత బలహీనపడినా, కాంగ్రెస్ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడం అనుమానమే. అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బీజేపీకి, కాంగ్రెస్÷–కు సవాలుగా ఉన్నాయి. తమ రాష్ట్రాలలో బీజేపీని, కాంగ్రెస్‌ను ఓడించిన ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికారంలో కొనసాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ గత బిఆర్ఎస్ పాలనకు భిన్నంగా నడుచుకోవాలి. మాటలు, పదేపదే విమర్శలు కట్టిపెట్టి ప్రజల కోం అంతా కలసి పనిచేయాలి. హైదరాబాద్ భూముల వివాదాన్ని పక్కన పెట్టాలి. వాటిని అమ్మాలన్న ఆలోచనను పక్కకు పెట్టాలి. అందుకు ప్రత్యమ్నాయంగా ఉచిత పథకాలకు కోతలు పెట్టాలి.

# తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్ర

## క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



హైదరాబాద్: వారంరోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతూనే ఉన్నాయి. అక్కడక్కడా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నా ఇప్పటికే అనేక చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువగా ఉంటోంది. వాతావరణశాఖ హెచ్చరికలు మరింత భయపెడు తున్నాయి. ఏపీ, తెలంగాణలో సూర్యుడి విశ్వరూపంతో పలు ప్రాంతాలకు హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు మరింత పెరుగు తాయని ఐఎండీ అంచనా వేసింది. మరి ఏప్రిల్ మొదటి రోజునే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఎలాగుంటుందన్న ఆందోళన కలుగుతోంది. ఇదే ఇప్పుడు తీవ్ర భయాందోళనలు రేపుతోంది. ఎందుకంటే ఏప్రిల్, మే రెండు నెలలు తీవ్రంగా ఉండనున్నాయి. తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ డేంజర్ వార్నింగ్ ఇచ్చింది. రోజు రోజుకీ తెలుగు రాష్ట్రాల్లో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం ఏడు గంటలకే చెంప చెళు మనిపిస్తూ 8 గంటలకల్లా చుక్కలు చూపిస్తున్నాడు. సెగలు కక్కుతోన్న సూరీడు, పది గంటలకు నడినెత్తిన మంట పెట్టినట్టు పొగలు సెగలు రేపుతున్నాడు. వారం రోజులుగా ఏపీ, తెలంగాణలో ఎక్కడచూసినా ఇదే పరిస్థితి. పలు ప్రాంతాల్లో ఉదయం 11గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నా యంటే సూర్యుడి విశ్వరూపం అర్థంచేసుకోవచ్చు. పైగా రాబోయే మూడు రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయంటూ వాతావరణశాఖ హెచ్చరించింది. అప్రమత్తంగా ఉండాలంటూ అలర్ట్ జారీ చేసింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలకు తోడు, వడగాల్పులు కూడా ఊహించని స్థాయిలో ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్ సెకండ్ వీక్ తర్వాత నిప్పుల కుంపటేనని హెచ్చరిస్తోంది. రాత్రుళ్లు సైతం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కూలర్లు, ఎసిల మోతలు వినిపిస్తున్నాయి. సాధారణం కంటే 2,3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ఇక రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట కూడా ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇరు రాష్ట్రాల్లో వడగాల్పులు ప్రభావం ఉంటుందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్,
పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాల్లో క్రమంగా ఉష్ణోగ్రతల పెరుగుదల కనినిస్తోంది. తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణు లు సూచిస్తున్నారు.
మంచినీరు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని.. ఎక్కువగా కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలని చెబుతున్నారు. డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని పేర్కొంటున్నారు.

# కేంద్రీకరణ దిశగా ప్రభుత్వం తీరు

## దేశాన్ని అగాధంలోకి నెడుతున్న విధానాలు

## కేంద్ర ప్రభుత్వంపై సోనియా విమర్శలు



న్యూఢిల్లీ: ప్రస్తుత ప్రభుత్వ మూడు అంశాల ఎజెండా విద్యా రంగంలో వినాశకరమైన పరిణామాలకు దారితీస్తోందని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ విమర్శించారు. సెంట్రలైజేషన్, కమర్షియలైజేషన్, కమ్యూనలైజేషన్ అనే మూడు సి... లు దేశ విద్యా విధానాన్ని శాసిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత దశాబ్దంలో అధికారాన్ని కేంద్రీకరించడం, విద్యను వ్యాపారంగా చేయడం, పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలు మతతత్వం
చేయడం వారికి తెలిసిన పక్రియ అని సోనియా విమర్శించారు. తాజాగా ఒక పత్రికకు రాసిన వ్యాసంలో ఆమె దేశంలోని పలు అంశాలపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత 11 సంవత్సరాలుగా ఈ ప్రభుత్వ పనితీరు కేంద్రీకరణ దిశగా సాగుతోందని, అత్యంత హానికరమైన పరిణామాలు విద్యా రంగంలోనే ఉన్నాయని సోనియా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా మంత్రులతో కూడిన కేంద్ర విద్యా సలహా మండలి సమావేశం 2019 సెప్టెంబర్ నుండి ఇప్పటివరకూ జరుపలేదన్నారు.జాతీయ విద్యా విధానం 2020 అమలుపై రాష్ట్ర ప్రభుత్వాలతో కనీసం ఒక్కసారైనా చర్చలు జరిపారా అని ఆమె నిలదీశారు. విద్య కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి అంశమైనా కేంద్ర ప్రభుత్వం ఒంటరి పోకడలకు పోతోందని విమర్శించారు. విద్యావ్యవస్థ ద్వారా చిన్నారుల్లో విద్వేషాన్ని పెంచడమనే ఆరెస్సెస్, బీజేపీ సుదీర్ఘ కాంక్షను ఇప్పుడు నెరవేర్చుకుంటున్నారని ఆమె అన్నారు. మహాత్మా గాంధీ హత్యోదంతాన్ని, మొగలుల పాలనా విషయాలను పుస్తకాల నుంచి ఎందుకు తొలగించారన్నారు. తగిన నైపుణ్యాలు లేకపోయినా ప్రతిష్మాత్మక యూనివర్సిటీల్లో వారి సిద్ధాంతాలకు
అనుగుణంగా ఉన్నవారికే కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారని సోనియా ఆక్షేపించారు. విద్యావ్యవస్థపై సాగుతున్న ఈ మారణహోమం వెంటనే ఆగిపోవాలని సోనియా తన వ్యాసంలో కోరుకున్నారు.

# సంక్షేమం పేరుతో..దివాళా తీయిస్తే ఎలా !

సంక్షేమం పేరుతో ఉచిత పథకాలు అమలు చేయమని చెప్పిందెవరు..ఉచిత బియ్యాలు, ఉచిత పందేరాలు... 58 ఏళ్లకే పెన్షన్లు..
.రాజకీయ నాయకులకు
జీతభత్యాలు..ఇవన్నీ ఎవరి కోసం..ప్రజలు కట్టిన పన్నులతో పాటన చేయాల్సిన నేతలు రాష్ట్రాలను దివాళా తీయించేస్తున్నారు.
అభివృద్ధి అంటే పెన్షన్లు పంచడం, సన్నబియ్యం పంచడం ఇదేనా..ఇవన్నీ నిలదీయడానికి ప్రజలంతా సిద్ధం కావాలి.
ఎపి కావచ్చు.. తెలంగాణ కావచ్చు....ధరల గురించి మాట్లాడరు. అభివృద్ధి గురించి మాట్లాడరు. వారి సెక్యూరిటీ, ఆకాశ హర్మ్యాలను నిర్మించుకోవడం...ప్రజల డబ్బుతో సోకులు చేసుకోవడం ఇదా పాలన అంటే..అన్నది ప్రజలంతా ఆలోచించాలి.
జగన్ తన హయాంలో రాజధాని, పోలవరం నిర్మాణాలను పక్కన పెట్టారు. విశాఖ భీమిలి దగ్గర మాత్రం అద్భుత సౌధాలను నిర్మించుకున్నారు. దీనికి నాటి పాలకులు నేటికీ సమర్థించు కుంటున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం ఉండదు. ఇలాంటి పాలకులు అవసరమా అని ఆలోచన చేయాలి. రాష్ట్రాలను అప్పుల్లో కూరుకు పోయేలా చేసి...దివాళా తీయించిన నేతలు నీతి వాక్యాలు పలుకుతున్నారు. అభివృద్ధి చేశామని గొప్పులు చెప్పుకుంటున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోళ్లు చేయరు. మిర్చి పండితే కొనుగోలు చేయలేరు. విద్యుత్, వైద్యం, విద్యారంగాలను పటిషంట చేయరు. ఇవన్నీ మరచి పందేరాలు చేస్తున్న ...వీరా మన పాలకులు ..అయినందుకు సిగ్గు పడాలి. ఇక తాజాగా హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని నిస్సిగ్గుగా అమ్మాలనుకోవడం రేవంత్ ప్రభుత్వ దివాళాకోరు విధానం కాక మరోటి కాదు. పెన్షన్లు, ఉచిత బస్సు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఎవరు అడిగారు. ఇవ్వడానికి డబ్బులు ఉన్నాయో లేదో ఆలోచించకుండా ఇష్టారీతిన హామీలు ఇచ్చి ఇప్పుడు భూములు, ఆస్తులు తెగనమ్మితే ఎలా. నీతులు పలుకుతున్న గత బిఆర్ఎస్ పాలకులు కూడా ఇంతకన్నా భిన్నంగా చేయలేదు. వారి హయాంలోనూ భూములు అమ్ముకున్నారు. పేదలు ఇళ్లు కొనగలిగేలా పరిస్థితులు ఉంటే మూసీ మురికిలో ఎందుకు నివసిస్తారు. మూసీ సుందరీకరణ పేరుతో వారిని నిర్వాసితులను చేయడం ఎంతవరకు
సమంజసం. మూసీ సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ పేరిట పేదల ఇళ్లు కూల్చడం ఎంతవరకు సబబు. లగచర్లలో ఫార్మా పేరుతో
దాడులు జరిగాయి. అభివృద్ధి పేరుతో గిరిజన తండాలపైకి వెళ్లారు. పాలకులు పక్కా రియల్ ఏజెంట్లలాగా మారితే ఇక రక్షించేదెవరన్నది గుర్తించాలి. చెప్పిన పథకాల అమలుకు, ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ నాయకులు హెచ్‌సియూ భూములను అమ్ముకుంటామంటే ఎలా! హెచ్‌సియూ భూములు అమ్మకాన్ని ఎవ్వరైనా తీవ్రంగా
తప్పు పట్టాల్సిందే. హైదరాబాద్‌లో హెచ్‌సీయూ పరిసర ప్రాంతాలే కాస్త ఆక్సిజన్ ఇచ్చే ప్రాంతాలుగా ఉన్నాయి.

ఉత్తేజిత దినపత్రిక



# వేతనాల పెంపుపై ఇన్ఫోసిస్ కీలక ప్రకటన..




దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్.. కీలక ప్రకటన చేసినట్లుగా తెలుస్తోంది. ఎప్పటినుంచో ఉద్యోగులకు వేతనాల పెంపు వాయిదా వేస్తూ వస్తున్న ఈ కంపెనీ ఇప్పుడు ఫిబ్రవరి నెలాఖర్లోగా ఇంక్రిమెంట్ లెటర్స్ అందించనున్నట్లు తెలిసింది. దీని గురించి ఈ వ్యవహారం గురించి తెలిసిన వ్యక్తులు వెల్లడించినట్లు పలు మీడియాల్లో వార్తలు వస్తున్నాయి.

ఐటీ ఉద్యోగులకు గత కొంత కాలంగా గడ్డు పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఆయా ఐటీ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ వస్తుండటం ఒక కారణం కాగా.. ఖర్చుల్ని తగ్గించుకోవడంలో భాగంగా ఆయా కంపెనీలు ఉద్యోగుల్ని తొలగిస్తూ కూడా వస్తున్నాయి. ఆర్థిక మందగమనం నేపథ్యంలో.. ఈ రంగానికి డిమాండ్ తగ్గిపోయినట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రముఖ టెక్ కంపెనీలు పెద్ద మొత్తంలో ఉద్యోగుల్ని తొలగించడం.. ఆ తర్వాత ఇదే ఎఫెక్ట్ దేశీయ ఐటీ కంపెనీలపైనా పడటం తెలిసిందే. దీంతో.. ఇక్కడ కూడా ఉద్యోగులకు వేతనాలు పెంచకపోవడం.. ఇతర ప్రోత్సాహకాలు తగ్గించడం.. కొత్తగా ఉద్యోగుల్ని నియమించుకోకపోవడం వంటివి జరిగాయి. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి.

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రముఖ ఐటీ కంపెనీలు కీలక ప్రకటనలు చేశాయి. చాలా వరకు వేతనాల పెంపును ప్రకటించాయి. ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికంలో మంచి ఫలితాల్ని నమోదు చేయడం ఇందుకు ఒక కారణం. ఇన్ఫోసిస్ కూడా ఫలితాల సందర్భంగా.. దీనిపై ప్రకటన చేయగా.. ఇప్పుడు ఎప్పుడు వేతనాల పెంపు అమల్లోకి వస్తుందో తెలియజేసినట్లు సమాచారం.

ఫిబ్రవరి నెల ఆఖర్లోనే ఇన్ఫోసిస్.. తమ ఉద్యోగులకు వేతనాల పెంపునకు సంబంధించి ఇంక్రిమెంట్ లెటర్స్ అందించనుందంట. అయితే.. సగటున ఉద్యోగులకు 5 నుంచి 8 శాతం వరకు వేతనాల పెంపు ఉంటుందని.. ఇన్ఫోసిస్ వేతనాల పెంపు వ్యవహారం గురించి తెలిసిన కొందరు వ్యక్తులు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేతనాల పెంపు ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే ఐటీకి మళ్లీ డిమాండ్ పెరుగుతుండటం సహా వచ్చే ఆర్థిక సంవత్సరంలో తమ బడ్జెట్ అంచనాలు పెరుగుతాయని టెక్ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. మన ఐటీ కంపెనీలకు ఆదాయం ఎక్కువగా నార్త్ అమెరికా నుంచే వస్తుందన్న సంగతి తెలిసిందే. మరోవైపు బ్యాచ్‌ల వారీగా ఇన్ఫోసిస్.. ప్రమోషన్ లెటర్స్ ఇప్పటికే ఇస్తోందని సమాచారం. డిసెంబర్ నెలలోనే తొలి బ్యాచ్‌కు ఇచ్చిందని.. ఇప్పుడు ఫిబ్రవరిలో రెండో దశ ప్రమోషనల్ లెటర్స్ ఇస్తుందని తెలుస్తోంది.

# ఉద్యోగులకు దిగ్గజ టెక్ కంపెనీ షాక్..



దిగ్గజ టెక్ సంస్థ మెటా ప్లాట్ ఫామ్స్ మరోసారి షాకింగ్ నిర్ణయం తీసుకుంది. భారీగా ఉద్యోగుల తొలగింపులకు సిద్ధమైంది. ఈసారి ఏకంగా 4 వేల మందికి పింక్ స్లిప్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 10నే ఉద్యోగులకు మెమోలు అందించనుందని పలు మీడియా నివేదికుల చెబుతున్నాయి. ఆ వివరాలు తెలుసుకుందాం.

ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా ప్లాట్ ఫామ్స్ తమ ఉద్యోగులకు షాకిచ్చింది. మరోసారి భారీగా తొలగింపులకు సిద్ధమైంది. ఈసారి సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో 5 శాతం మేర తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. అంటే దాదాపు 4000 మందిపై ప్రభావం పడనుందని అంతర్జాతీయ మీడియాలు పేర్కొంటున్నాయి. ఫిబ్రవరి 10వ తేదీనే లేఆఫ్స్‌కి సంబంధించిన మెమోలు ఉద్యోగులు అందించనున్నారని సమాచారం. ఇందుకు సంబంధించిన ఓ మెమో లీకైనట్లు బిజినెస్ ఇన్‌సైడర్ న్యూస్ సంస్థ ఓ కథనం ప్రచురించింది. కంపనీలో పని తీరు సరిగా లేని ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మెటా వర్గాలు తెలిపినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఏడాది మెటా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం భారీగా పెట్టుబడి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కి తెరతీసినట్లు టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నిర్ణయంతో కంపెనీలోని 5 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం పడనుంది. ఈ విషయంపై గత నెలలో సిబ్బందితో మాట్లాడిన కంపెనీ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ క్లారిటీ ఇచ్చారు. సరైన పని తీరు లేని వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఆసియా, ఆఫ్రికా, యూరప్ సహా అంతర్జాతీయంగా మొత్తం 12 దేశాల్లో ఈ లేఆఫ్స్ ఉంటాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. అయితే, ఉద్యోగాలు కోల్పోయిన వారికి సంస్థ నుంచి అందాల్సిన ఆర్థిక, వృత్తి పరమైన సహాయం అందుతుందని మార్క్ జుకర్‌బర్గ్ తెలిపారు. ఈసారి 3000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నారని తొలుత వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆ సంఖ్య 4 వేలకు చేరినట్లు తెలుస్తోంది. భారీగా లేఆఫ్స్ చేపట్టడం టెక్ ఉద్యోగుల్లో మళ్లీ ఆందోళనలు పెంచుతోంది.

కోవిడ్-19 మహమ్మారి విజృంభణ తర్వాత టెక్, ఐటీ ఇండస్ట్రీలో భారీగా లేఆఫ్స్ జరిగిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది నుంచి కాస్త కోలుకున్నప్పటికీ ఉద్యోగుల్లో మాత్రం ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే దిగ్గజ టెక్ సంస్థలైన మైక్రోసాఫ్ట్, అమెజాన్, సేల్స్ ఫోర్స్ వంటి ఇతర సంస్థలు వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. దీంతో మరోసారి టెక్ ఉద్యోగుల భవిష్యత్తు అయోమయంలో పడిపోయిందని చెప్పవచ్చు. చాలా సంస్థలు ఉద్యోగుల పనితీరుపై ఫోకస్ పెట్టాయి. సరిగా లేని ఉద్యోగులను ఇళ్లకు పంపించేస్తున్నాయి.

# మ్యూచువల్ ఫండ్ కీలక నిర్ణయం..



దేశీయ దిగ్గజ అసెట్ మెనేజ్మెంట్ కంపెనీల్లో ఒకటైన టాటా మ్యూచువల్ ఫండ్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ ఏఎంసీకి చెందిన రెండు పాపులర్ ఈక్విటీ ఫండ్ పథకాలను విలీనం చేస్తేందుకు ఆమోదం తెలిపింది. టాటా క్వాంట్ ఫండ్ టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ స్కీమ్స్ విలీనం కానున్నాయి. క్వాంట్ ఫండ్‌ను ట్రాన్స్‌ఫర్ స్కీమ్‌గా వ్యవహరిస్తారు. ఇక ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను సర్వైవింగ్ స్కీమ్‌గా వ్యవహరిస్తారు. అంటే ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌గా అందుబాటులో ఉండనుందని అర్థమవుతోంది. ఈ రెండు ఫండ్స్ విలీనం చేసేందుకు రికార్డ్ తేదీని మార్చి 21, 2025గా టాటా మ్యూచువల్ ఫండ్స్ నిర్ణయించింది. ఈ మేరకు తమ యూనిట్ హెూల్డర్లకు నోటీసుల ద్వారా సమాచారం అందించింది.

సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (మ్యూచువల్ ఫండ్స్) రెగ్యులేషన్స్ 1996లోని రెగ్యులేషన్ 18ప్రకారం ఈ విలీనం ఉండనుందని టాటా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. 30 రోజుల్లోగా ఈ విలీనం అమలులోకి రానుంది. మెర్జర్ స్కీమ్ కి చెందిన యూనిట్ హెూల్డర్లకు ఎలాంటి ఎగ్జిట్ లోడ్ ఉండదు. అంటే టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హెూల్డర్లు ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లోకి మారతారని, ఈ మార్పు సమయంలో ఎలాంటి ఛార్జీలు ఉండవని నోటీసులో పేర్కొంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 13, 2025 నుంచి టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ల విక్రయాలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

విలీనం అయ్యే స్కీమ్ టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హెూల్డర్లకు రాతపూర్వక సమాచారాన్ని అందిస్తున్నట్లు టాటా మ్యూచువల్ ఫండ్ తెలిపింది. కొత్త స్కీమ్ టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ఎన్ని యూనిట్లు వస్తాయి, పన్ను సమస్యలు ఏముంటాయి, ఆర్థిక సమాచారం వంటి వివరాలు అందిస్తున్నట్లు పేర్కొంది. రికార్డ్ తేదీ మార్చి 21 నుంచి టాటా క్వాంట్ ఫండ్ యూనిట్ హెూల్డర్లు టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ యూనిట్ హెూల్డర్లుగా మారనున్నారు.

మరోవైపు.. ప్రస్తుత నియంత్రణ అవసరాల పరంగా టాటా క్వాంట్ ఫండ్లలోని యూనిట్ హెూల్డర్లు విలీనానికి అనుకూలంగా లేకుంటే ఎటువంటి నిష్క్రమణ లోడ్ లేకుండా ప్రస్తుత నికర ఆస్తి విలువ వద్ద యూనిట్లు విక్రయించేందుకు ఒక ఆప్షన్ ఇస్తారు. విలీనానికి అంగీకరించని యూనిట్ హెూల్డర్లు ఫిబ్రవరి 19, 2025 నుంచి మార్చి 20, 2025 వరకు ఎగ్జిట్ ఆఫర్ ఉంటుంది. మార్చి 20, 2025 నాటికి ఎలాంటి రిడంప్షన్ లేదా స్విచ్ రిక్వెస్ట్ రాకుంటే ఆటోమేటిక్‌గా టాటా క్వాంట్ ఫండ్ యూనిట్లు టాటా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌గా మారతాయి.

# 7 రోజుల్లో 40 శాతం జంప్!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం సెషన్లో ఆరంభంలో భారీగా పడిపోగా.. ఆఖర్లో తేరుకున్నాయి. అయినప్పటికీ నష్టాల్లోనే ముగిశాయి. గత 5 సెషన్లు మాత్రం స్టాక్ మార్కెట్లు కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. మార్కెట్లు భారీగా పడిపోయినప్పటికీ ఒక స్టాక్ మాత్రం 7 సెషన్లుగా అప్పర్ సర్క్యూట్ కొడుతూనే ఉంది. దీని గురించి చూద్దాం.

స్టాక్ మార్కెట్లు గత కొద్ది రోజులుగా తీవ్ర ఒడుదొడుకుల్లో లోనవుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు.. మార్కెట్లో అనిశ్చితికి కారణమవుతోంది.

ట్రంప్ వరుసగా దిగుమతి సుంకాలు విధిస్తుండగా.. భారత స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. ఇవాళ్టితో (బుధవారం) మినహాయిస్తే గత 5 సెషన్లలో చూసినట్లయితే సెన్సెక్స్ ఏకంగా 2 వేల పాయింట్లకుపైగా పడిపోయింది. నిఫ్టీ కూడా భారీగానే పతనమైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 17 లక్షల కోట్లకుపైగా తగ్గింది. అయితే బుధవారం సెషన్లో మాత్రం కాస్త ఊరట దక్కింది.

ఫిబ్రవరి 12న కూడా ఆరంభంలో స్టాక్ మార్కెట్లు భారీగా పడిపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్లకుపైగా పడిపోగా.. ఇంట్రాడేలో తేరుకుంది.




మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లాభాల్లోకి వచ్చిన సూచీలు ఆఖర్లో మాత్రం స్వల్ప నష్టాలతో ముగించాయి. సెన్సెక్స్ చివరకు 120 పాయింట్లకుపైగా పడిపోయి 761,71 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26 పాయింట్లు తగ్గి 23,045 వద్ద స్థిరపడింది.

అయితే గత కొన్ని రోజులుగా మార్కెట్లు ఇలా నష్టపోతున్నప్పటికీ.. ఒక స్టాక్ గురించి మనం ప్రధానంగా మాట్లాడుకోవాలి. మార్కెట్ లాభనష్టాలతో సంబంధం లేకుండా ఇది వరుసగా అప్పర్ సర్క్యూట్స్ కొడుతూనే ఉండటం విశేషం. అదే శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ లిమిటెడ్. బుధవారం సెషన్లో ఈ స్టాక్ 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టి రూ. 522.10 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలోనే వరుసగా వారం రోజులుగా ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్లోనే ఉండటం విశేషం.

చివరగా ఫిబ్రవరి 3న ఈ స్టాక్ ధర రూ. 371.15 వద్ద ఉండగా.. ఫిబ్రవరి 4, 5, 6, 7, 10, 11, 12 ఇలా వరుసగా ఏడో సెషన్లో కూడా 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో ఇన్వెస్టర్లు పండగ చేసుకున్నారని చెప్పొచ్చు. ఇక కంపెనీ మార్కెట్ విలువ రూ. 1.32 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ విలువ రూ. 2219.95 కాగా.. కనిష్ఠ ధర రూ. 41.25 గా ఉంది.

గత 5 రోజుల్లో 21 శాతానికిపైగా పెరిగింది. నెలలో మాత్రం 40 శాతానికిపైగా నష్టాల్ని అందించింది. ఏడాది వ్యవధిలో చూస్తే 1100 శాతానికిపైగా రిటర్న్స్ అందించింది. ఐదేళ్లలో చూస్తే 38 వేల శాతానికిపైగా పెరగడం మరో విశేషం.

అయితే మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మర్చిపోవద్దు. అప్పుడు మాత్రమే ఎక్కువగా రిస్క్ లేకుండా రిటర్న్స్ అందుకోవచ్చు.

# అమెరికన్లలో తీవ్ర భయాందోళనలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఎలాన్ మస్క్ చాలా కీలక వ్యక్తిగా మారారు. ఇప్పటికే ఆయనకు డోజ్ బాధ్యతలు అప్పగించిన ట్రంప్.. తాజాగా మరిన్ని అధికారాలను కట్టబెట్టారు. దీంతో ఎలాన్ మస్క్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అని అమెరికన్లలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా ప్రభుత్వ ఉద్యోగాల్లో కోతలు విధించి.. అనవసర ఖర్చును నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ట్రంప్, మస్క్ అనేక సంచలన నిర్ణయాలకు తెరతీస్తున్నారు.

రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. తన 2.0 పాలనలో సంచలన నిర్ణయాలు ఉంటాయని మొదటి నుంచీ చెబుతూనే ఉన్నారు. వృథా ఖర్చులు తగ్గించి.. ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి నియామకాలు, తొలగింపులు చూసుకునేందుకు.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ-డోజ్‌ను ట్రంప్ ఏర్పాటు చేశారు. ఈ డోజ్ బాధ్యతలను ప్రపంచ అపర కుబేరుడు.. టెస్లా, స్పేస్ ఎక్స్, ట్విటర్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చర్యలు చేపట్టిన డోజ్.. అధికంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించింది. మరోవైపు.. తాజాగా ఎలాన్ మస్క్‌కు మరిన్ని అధికారులు ట్రంప్ కట్టబెట్టడంతో అమెరికాలో భారీగా ఉద్యోగాల కోతలు ఉంటాయని అమెరికన్ల భయపడిపోతున్నారు.

తాజాగా ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్‌కు మరిన్ని అధికారాలు కల్పించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అయితే ట్రంప్ సంతకం చేసే సమయంలో ఓవల్ ఆఫీస్‌లో ఎలాన్ మస్క్ తన నాలుగేళ్ల కుమారుడు %శ్ర ా-శఅఅ% తో కలిసి ఉండడం గమనార్హం. ఈ నిర్ణయంతో అమెరికాలో భారీగా ప్రభుత్వ ఉద్యోగాల కోతలు ఉండనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఇక నుంచి అమెరికా ఫెడరల్ ఏజెన్సీలు.. డోజ్‌ను సంప్రదించిన తర్వాతే ఉద్యోగులను నియమించుకోవడం, తొలగించడం చేయాలని తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ట్రంప్ వెల్లడించారు. ప్రతీ ఫెడరల్ ఏజెన్సీ తక్కువ ఉద్యోగులతో పనిచేయాలని.. అవసరమైన మేరకు మాత్రమే కొత్త ఉద్యోగులను తీసుకోవాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డోజ్ పనితీరును డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు గుప్పించారు. ఇక డోజ్ తీసుకుంటున్న నిర్ణయాలపై దావాలు నమోదు అవుతున్నా.. వాటిని పట్టించుకోకుండా ముందుకు సాగాలని మస్క్‌కు సూచించారు. అమెరికా ప్రభుత్వంలో భారీ సంస్కరణలు తీసుకువచ్చేందుకే రిపబ్లికన్ పార్టీని అమెరికన్లు



ఓటు వేసి గెలిపించారని ఎలాన్ మస్క్ తెలిపారు. అందుకే ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని.. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని పేర్కొన్నారు. పారదర్శకంగా పనిచేసేందుకు డోజ్ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుందని వివరించారు. వృథా ఖర్చులు, అనవసర ఉద్యోగులను తగ్గించకపోతే అమెరికా దివాలా తీస్తుందని ఎలాన్ మస్క్ వెల్లడించారు.

# 7 వేలకు పైగా కోళ్లను చంపిన మహారాష్ట్ర సర్కారు!

రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రను బర్డ్ ఫ్లూ కుదిపేస్తోంది. ఇప్పటికే బర్డ్ ఫ్లూ కారణంగా అనేక కోళ్లు, పక్షులు, జంతువులు మృత్యువాత పడగా.. తాజాగా మహారాష్ట్ర సర్కారే కోళ్లను చంపేస్తోంది. అలాగే బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే గుడ్లను సైతం నాశనం చేస్తోంది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్కారు చెబుతుండగా.. ప్రజలంతా తీవ్రంగా భయపడిపోతున్నారు.

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి ఒకటవ తేదీ నుంచి బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతమైన 7 ప్రాంతాలను గుర్తించింది. ఈక్రమంలోనే అక్కడ ఉన్న 7,200 కోళ్లను చంపేసింది. అలాగే 2 వేల 230 గుడ్లను నాశనం చేసింది. చంద్రపూర్ జిల్లాలోని మంగ్లీ గ్రామంలో తాజాగా బర్డ్ ఫ్లూ వ్యాప్తిని చెందింది. ఈక్రమంలోనే అక్కడి నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఇప్పటికే 2,065 కోళ్లు చనిపోయాయి.

అయితే విషయం గుర్తించిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతం నుంచి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని కోళ్లు, గుడ్లు, పశుగ్రాసాన్ని నాశనం చేయాలని నిర్ణయించింది. ఈక్రమంలోనే చంద్రాపూర్ జిల్లాలో 1,165 గుడ్లతో పాటు 50 కిలోల దాణాను నాశనం చేయించింది. అలాగే కోళ్ల పెంపకం దారులకు నష్ట పరిహారంగా రూ.2,91,963 అందించారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు మహారాష్ట్రలోని లాతూర్, నాందేడ్, నాగ్‌పూర్, థానే, రాయ్‌గఢ్, చంద్రాపూర్ జిల్లాల నుంచి ఇప్పటి వరకు మొత్తంగా 7 బర్డ్ ఫ్లూ ప్రభావిత కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా లాతూర్ జిల్లాలోని ఉద్గిర్ తాలూకాలో 71 కాకులు చనిపోయాయి. ఈక్రమంలోనే వీటికి పరీక్షలు చేయగా.. బర్డ్ ఫ్లూ కారణంగానే ఇవి ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. కేవలం కాకులు, కోళ్లలోనే కాకుండా పులులు, చిరుతలు, రాబందుల్లోనూ బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయినట్లు వివరించారు. అలాగే నాగ్‌పూర్‌లోని గోరేవాడ రెస్క్యూ సెంటర్‌లో ఉంచిన 3 పులులు, ఒక చిరుత పులి సహా 693 జంతువులు, పక్షులు బర్డ్ ఫ్లూ కారణంగా చనిపోయిట్లు తెలిపారు. ముఖ్యంగా ఇందులో మూడు తెల్లటి వీపు గల రాబందులు కూడా ఉన్నట్లు చెప్పారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ.. వ్యవస్థీకృత పౌల్ట్రీ సంస్థల నుంచి ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నివేదించబడలేదని తెలిపారు. కోళ్ల ఫాంల యజమానులు బయో భద్రతా చర్యలు చేపట్టారని.. ముఖ్యంగా కోళ్లు వలస పక్షులతో సంబంధంలోకి రాకుండా చూసుకుంటున్నాయని చెప్పుకొచ్చారు. వీటి వల్లే బర్డ్ ఫ్లూ వ్యాప్తిని నివారించవచ్చని స్పష్టం చేశారు.

# ప్రపంచంలోనే అవినీతి దేశంగా దక్షిణ సూడాన్



ప్రపంచంలోనే అత్యంత అవినీతి కలిగిన దేశంగా ఈ ఏడాది దక్షిణ సూడాన్ చెత్త రికార్డు సృష్టించింది. ఇక అవినీతి అతి తక్కువ ఉన్న దేశంగా డెన్మార్క్ తొలి స్థానంలో నిలిచింది. ఈ అవినీతి దేశాల జాబితాలో భారత్ 96వ స్థానంతో సరిపెట్టుకుంది. అది గత ఏడాదితో పోల్చితే 3 స్థానాలు పడిపోయింది. మొత్తం ప్రపంచంలోనే 180 దేశాలతో జాబితా రూపొందించింది. అయితే గత 3 ఏళ్లుగా వరుసగా భారత్ స్థానం పడిపోతుండటం గమనార్హం.

2024 ఏడాదికి సంబంధించి ప్రపంచంలోనే అత్యంత అవినీతి ఉన్న దేశాల జాబితా తాజాగా విడుదలైంది. గతేడాదికి సంబంధించి కరప్షన్ పెర్సెప్షన్స్ ఇండెక్స్‌ను ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ విడుదల చేసింది. మొత్తం 180 దేశాలకు సంబంధించిన అవినీతి సూచీని విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్ స్థానం మరోసారి పడిపోయింది. 2023 ఏడాదిలో 93వ స్థానంలో ఉన్న భారత్.. 2024కు వచ్చే సరికి మూడు స్థానాలు పడిపోయి.. 96వ స్థానంలో నిలిచింది. ప్రతీ సంవత్సరం నిపుణులు, వ్యాపారవేత్తల దృష్టిలో ఆయా దేశాల్లో అవినీతి ఎలా ఉంది అనే అంచనాలతో ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. టాప్-5లో డెన్మార్క్, ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, లక్సంబర్గ్ నిలిచాయి.

ఆయా దేశాల్లో ఉండే అవినీతిని బట్టి ఈ సూచీలో 0 నుంచి 100 వరకు స్కోర్‌ను కేటాయించారు. సున్నా స్కోర్ ఉంటే అత్యంత అవినీతి దేశంగా.. 100 స్కోర్ సాధిస్తే అసలు అవినీతి లేని దేశంగా పరిగణిస్తారు. ఈ లిస్ట్‌లో మొట్టమొదటి స్థానంలో డెన్మార్క్ నిలిచింది. 100 స్కోరుకు గానూ డెన్మార్క్ 90 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. డెన్మార్క్ తర్వాత 88 పాయింట్లతో ఫిన్లాండ్ రెండో స్థానంలో ఉంది. మరోవైపు.. 84 పాయింట్లతో సింగపూర్ మూడో స్థానంలో.. 83 పాయింట్లతో న్యూజిలాండ్ నాలుగో స్థానంలో.. 81 పాయింట్లతో లక్సంబర్గ్ ఐదో స్థానంలో నిలిచాయి.

ఇక అవినీతి దేశాల జాబితాలో భారత్ 96వ స్థానంలో ఉన్నట్లు ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 100 పాయింట్లకు గానూ భారత్ కేవలం 38 స్కోరు సాధించినట్లు పేర్కొంది. అయితే అంతకుముందు ఏడాది 2023లో 39 పాయింట్లతో భారత్ 93వ స్థానంలో ఉండగా.. 2024 ఏడాదిలో మాత్రం మూడు స్థానాలు పడిపోయి 96వ స్థానంలో నిలిచింది. అంతకుముందు 2022లో 40 పాయింట్లతో 85వ స్థానంలో భారత్ నిలిచింది. ఇక ఈ జాబితాలో చైనా 76వ స్థానంలో ఉంది. భారత్‌కు పొరుగున ఉన్న దేశాలైన పాకిస్తాన్ 27 పాయింట్లతో 135వ ర్యాంకులో ఉంది. 32 పాయింట్లతో శ్రీలంక 121వ ర్యాంకు.. బంగ్లాదేశ్ 149వ ర్యాంకులో ఉన్నాయి. తాలిబన్‌లు పాలిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ కేవలం 17 పాయింట్లతో 165వ స్థానంలో ఉంది. ఇక ఈ అవినీతి దేశాల జాబితాలో అత్యంత అవినీతిమయమైన దేశంగా దక్షిణ సుడాన్ నిలిచింది. కేవలం 8 పాయింట్లతో ఈ లిస్ట్‌లో అట్టడుగున 180వ స్థానంలో నిలిచింది. కింది నుంచి రెండో స్థానంలో 9 పాయింట్లతో 179వ స్థానం.. 10 పాయింట్లతో వెనుజులా 178వ స్థానం.. 12 పాయింట్లతో సిరియా 177వ స్థానం.. లిబియా 13, ఈక్వటోరియల్ గునియా 13, నికరాగ్వా 15తో అత్యంత అవినీతిమయమైన దేశాలుగా నిలిచాయి.

# ఉచితాలతో ప్రజలను సోమరులుగా మారుస్తున్నారు..

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత వాగ్దానాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ హామీలను తప్పుపట్టిన సుప్రీంకోర్టు... ఉచిత ప్రకటనలు సరికాదని హితవు పలికింది. ఆ విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. ఇది ప్రజలను సోమరులుగా మారుస్తుందని వ్యాఖ్యానించింది. ఉచిత రేషన్, డబ్బు అందడం వల్ల ఎవరూ పనిచేయడానికి కూడా ఇష్టపడటం లేదని, ఇలాంటివి మానుకోవడం ఉత్తమమని అభిప్రాయపడింది. గతంలోనూ సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలు చేసింది.

ఉచితాలపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రకటించిన ఉచితాలను తప్పుబట్టింది. ఉచితంగా రేషన్, నగదు అందుతుండటంతో ప్రజలు పనిచేయడానికి ఇష్టపడటం లేదని వ్యాఖ్యానించింది. ఉచితాలతో పని చేయకుండా ఆహారం, డబ్బు సంపాదిస్తున్నారని పేర్కొంది. ఎన్నికల్లో ఉచిత పథకాలను ప్రకటించే విధానం మంచిది కాదని అభిప్రాయపడింది. ఉచిత పథకాలతో లబ్దిదారులను పరాన్నజీవులుగా మారుస్తున్నామని జస్టిస్ బిఆర్ గవాయ్ మండిపడ్డారు. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. ఈ అంశంపై విచారణను ఆరు వారాల పాటు వాయిదా వేసింది.

జనవరిలోనూ సుప్రీంకోర్టు ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. ఎన్నికలు రాగానే లాడ్లీ బెహెన్‌తో పాటు పలు పథకాలను ప్రకటించి.. సొమ్ములను పంచిపెడతారని మండిపడింది. ఢిల్లీలో ఇప్పుడు ఓ పార్టీ రూ.2,500 ఇస్తామంటే.. ఇంకో పార్టీ తాము దీనికి రెట్టింపు ఇస్తామని హామీ ఇస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉచితాలకు డబ్బులు ఉంటాయని, కోర్టుల్లో పనిచేసే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి మాత్రం ఉండవని తూర్పారబట్టింది. గతంలో సీనియర్ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సమయంలో ఉచితాలు అంటే ఏమిటి? అని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిని తాము అడ్డుకోలేమని తేల్చిచెప్పింది. అంతేకాదు, సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, తాగునీరు వంటివి సౌకర్యాలు ఉచితాలుగా పరిగణించవచ్చా? ప్రజల హక్కా..? అని ప్రశ్నించింది

అయితే, ఉచితాలపై అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. 2013లో సుబ్రమణ్యం బాలాజీ కేసులో మాత్రం భిన్నమైన వ్యాఖ్యలు చేసింది. 'అర్హులైన వ్యక్తులకు కలర్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు మొదలైన వాటి రూపంలో పెద్ద మొత్తంలో పంపిణీ చేయడం అనేది నేరుగా రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు సంబంధించింది.. ఇందులో జోక్యం చేసుకోలేము' అని కోర్టు స్పష్టం చేసింది. కాగా, ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ పోటాపోటీగా ఉచితాలను ప్రకటించాయి. దీనిని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచిత తాయిలాలు.. నగదు ఆధారిత పథకాలపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరారు. దీనిని పరిశీలించిన హైకోర్టు. అత్యవసరంగా విచారించేందుకు నిరాకరించింది




# ఇన్వెస్టర్ల సంపదను డబుల్ చేసిన మ్యూచువల్ ఫండ్లు ఇవే..

మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ వారి సంఖ్య ఏటా పెరుగుతోందని చెప్పొచ్చు. గత నెలలో ఏకంగా రూ. 26,866 కోట్ల మేర పెట్టుబడులు రావడం విశేషం. న్యూ ఫండ్ ఆఫర్, థీమ్యాటిక్ ఫండ్స్ దీంట్లో కీలక పాత్ర వహించాయి. అయితే ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌లో గత 3 సంవత్సరాల వ్యవధిలో ఇన్వెస్టర్ల సంపదను రెట్టింపు చేసిన స్కీమ్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఈక్విటీ మార్కెట్లలో దేశీయ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతున్న క్రమంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. గత నెలలో రూ. 26,866 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. జనవరి వచ్చిన రూ. 21 వేల కోట్లతో పోలిస్తే ఫిబ్రవరిలో 23 శాతం పెరిగాయి. ఇక మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ ఫిబ్రవరి చివరి నాటికి రూ. 54,54,214.13 కోట్లకు పెరిగింది. ముఖ్యంగా సిప్ ద్వారా వస్తున్న పెట్టుబడులే పెరిగాయి. కొత్త సిప్ అకౌంట్లు గత నెలలో 49,79,431 ప్రారంభం కావడం విశేషం. మ్యూచువల్ ఫండ్లతో బంపర్ రిటర్న్స్ వస్తాయని తెలిసిందే. ఇక్కడ కాంపౌండ్ ఇంట్రెస్ట్ కీలక పాత్ర పోషిస్తుంటుంది. వడ్డీపై వడ్డీ రావడంతో ఏటా రాబడి పెరుగుతూనే ఉంటుంది. స్టాక్ మార్కెట్లతో పోలిస్తే ఇక్కడ రిస్క్ కాస్త తక్కువ ఉంటుందని చెప్పొచ్చు. అందుకే దీంట్లో ఎక్కువగా సిప్ (క్రమానుగత పెట్టుబడులు) పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఇప్పుడు గడిచిన మూడేళ్లలో పెట్టుబడిదారుల సంపదను రెట్టింపు చేసినటువంటి ఫండ్ స్కీమ్స్ ఏమున్నాయో చూద్దాం.

క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్.. మ్యూచువల్ ఫండ్లలో క్వాంట్ స్కీమ్‌కు మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువ రిటర్న్స్ ఇందులో వస్తుంటాయి. 3 సంవత్సరాల వ్యవధిలో క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ 196 శాతం రిటర్న్స్ అందించింది. అంటే ఇక్కడ రూ. లక్ష పెట్టుబడి రూ. 2.95 లక్షలుగా మారింది.

క్వాంట్ మిడ్ క్యాప్ ఫండ్.. ఇది మూడేళ్ల కాలంలో 158 శాతం రిటర్న్స్ అందించగా.. రూ. లక్ష పెట్టుబడిని రూ. 2.58 లక్షలు చేసింది. క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ – 3 సంవత్సరాల్లో ఈ స్కీమ్ 144 శాతం రిటర్న్స్ అందించగా.. లక్ష పెట్టుబడి పెట్టిన వారికి రూ. 2.43 లక్షలొచ్చాయి.

నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్– ఇది 143 శాతం రిటర్న్స్ ఇచ్చింది. లక్ష పెట్టుబడిని మూడేళ్లలోనే రూ. 2.43 లక్షలుగా మలిచింది. స్మాల్ క్యాప్ ఫండ్ మూడేళ్లలో 138 శాతం రిటర్న్స్ ఇవ్వగా లక్షకు రూ. 2.38 లక్షలొచ్చాయి.

క్వాంట్ ఈఎల్ఎస్ఎస్ టాక్స్ సేవర్ ఫండ్ కూడా 3 సంవత్సరాల కాలంలో 134 శాతం పెరగ్గా.. లక్ష పెట్టుబడిని రూ. 2.33 లక్షలు చేసింది.

మోతీలాల్ ఓస్వాల్ మిడ్ క్యాప్ ఫండ్ 132 శాతం రిటర్న్స్ అందించగా.. లక్ష పెట్టుబడిపై రూ. 2.32 లక్షలొచ్చాయి. స్మాల్ క్యాప్ ఫండ్‌లో రూ. లక్షపై రూ. 2.26 లక్షలొచ్చాయి. అంటే ఇక్కడ 127 శాతం రిటర్న్స్ మూడేళ్లలోనే పొందారు ఇన్వెస్టర్లు. క్వాంట్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్– 3 సంవత్సరాల కాలంలో ఈ మ్యూచువల్ ఫండ్ స్కీమ్ 125 శాతం లాభాలు ఇవ్వగా.. రూ. లక్ష పెట్టినోళ్లకు రూ. 2.25 లక్షలు అందాయి. ఫ్రాంక్లిన్ ఇండియా స్మాలర్ కంపెనీస్ ఫండ్ 3 ఏళ్లకు 122 శాతం రిటర్న్స్ అందించగా లక్ష పెట్టుబడిని రూ. 2.21 లక్షలుగా మలిచింది.

# వారి కోసం ఎస్‌బీఐ స్పెషల్ స్కీమ్.. ఎక్కువ వడ్డీ దీంట్లోనే..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కస్టమర్ల కోసం ఎన్నో రకాల స్కీమ్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేస్తూ స్పెషల్ పథకాలు కూడా ప్రవేశపెట్టింది. వీటిల్లో అమృత్ కలశ్, సర్వోత్తమ్ ఎఫ్‌డీ, ఎస్‌బీఐ వీకేర్ వంటి స్కీమ్స్ వంటివి ఉన్నాయి. సీనియర్ సిటిజెన్ల కోసం ఉద్దేశించిన వీకేర్ పథకం గురించి ఇప్పుడు చూద్దాం. సీనియర్ సిటిజెన్ల కోసమే భారతీయ స్టేట్ బ్యాంక్ ఒక స్పెషల్ స్కీమ్ తీసుకొచ్చింది. అదే వీకేర్. సీనియర్ సిటిజెన్లకు ఈ పథకంలో భాగంగా రెగ్యులర్ డిపాజిట్లతో పోలిస్తే అధిక వడ్డీ అందిస్తుంది. 5 సంవత్సరాల నుంచి పదేళ్ల వ్యవధి డిపాజిట్లపై ప్రస్తుతం ఈ స్కీంలో ఎక్కువ వడ్డీ ఆఫర్ చేస్తోంది ఎస్‌బీఐ. ఈ స్కీమ్స్‌ను పరిమిత కాలవ్యవధితో తీసుకొస్తుంటాయి. ఇందులో చేరేందుకు గడువు ముగుస్తోంది. గతంలో కస్టమర్ల డిమాండ్ నేపథ్యంలో పలుమార్లు ఈ పథకాల గడువుల్ని పొడిగించిన ఎస్బీఐ.. మరి ఇప్పుడు పొడిగిస్తుందో లేదో చెప్పడం కష్టం. ప్రస్తుతానికి అయితే 2024, మార్చి 31 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంది. ఈ మేరకు బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంది. ఫ్రెష్ డిపాజిట్స్ సహా రెనివల్ చేసుకునేవారికి కూడా ఈ స్కీమ్ వర్తిస్తుందని ఎస్బీఐ వెల్లడించింది. సాధారణంగా ఎస్‌బీఐ సహా ఇతర ఏ బ్యాంకులు అయినా జనరల్ సిటిజెన్లతో పోలిస్తే సీనియర్ సిటిజెన్లకు 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ ఎక్కువ అందిస్తుంటాయి. కూడా అలాగే ఆఫర్ చేస్తోంది. ఈ బ్యాంకు ఇప్పుడు సీనియర్ సిటిజెన్లకు వారం రోజుల నుంచి 10 సంవత్సరాల వ్యవధి డిపాజిట్లపై కనిష్టంగా 4 శాతం నుంచి 7.50 శాతం వరకు వడ్డీ అందిస్తోంది. అత్యధికంగా ఎస్బీఐ వీకేర్ స్పెషల్ ఎఫ్‌డీపైనే 7.50 శాతం వడ్డీ అందిస్తోంది. వీకేర్ స్పెషల్ ఎఫ్డీ టెన్యూర్ 5 నుంచి 10 ఏళ్లుగా ఉంటుంది. ఈ టెన్యూర్ డిపాజిట్‌పైనే అత్యధిక వడ్డీ అందుతోంది. దీంట్లో రూ. లక్ష జమ చేస్తే ఎంతొస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. ఉదాహరణకు ఎస్బీఐ వీకేర్ స్కీమ్‌లో ఐదేళ్ల టెన్యూర్‌కు ఇప్పుడు రూ. లక్ష డిపాజిట్




చేసినట్లయితే ప్రస్తుతం ఉన్న 7.50 శాతం వడ్డీ లెక్కన మెచ్యూరిటీకి మీ చేతికి రూ. 44,995 వడ్డీ వస్తుంది. మీ చేతికి మొత్తం రూ. 1,44,995 అందుతుంది. అదే రూ. 5 లక్షలు డిపాజిట్ చేసినట్లయితే వడ్డీతో కలిపి మీ చేతికి రూ. 7,24,974 వస్తుంది.

ఇక ఈ బ్యాంకుల గురించి చూస్తే సీనియర్ సిటిజెన్లకు 7 నుంచి 45 రోజుల డిపాజిట్లపై 4 శాతం వడ్డీ, 46 రోజుల నుంచి 179 రోజుల పై 5.25 శాతం వడ్డీ వస్తుంది. 180–210 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 6.25 శాతం వడ్డీ, 211 రోజుల నుంచి ఏడాది లోపు డిపాజిట్లపై 6.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఏడాది నుంచి రెండేళ్ల డిపాజిట్లపై 7.30 శాతం, రెండేళ్ల నుంచి మూడేళ్ల డిపాజిట్లపైనా 7.50 శాతం వడ్డీ అందుతోంది. ఎస్‌బీఐ ఇతర స్పెషల్ స్కీమ్స్ విషయానికి వస్తే 400 రోజుల టెన్యూర్‌తో ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం ఉంది. దీంట్లో రెగ్యులర్ సిటిజెన్లకు 7.10 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.60 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. ఈ స్కీం లాస్ట్ డేట్ కూడా 2024, మార్చి 31గానే ఉంది. ఎస్‌బీఐ గ్రీన్ డిపాజిట్లను కూడా ఆఫర్ చేస్తోంది. ఇందులో సీనియర్ సిటిజెన్లకు 1111, 1777, 2222 రోజుల టెన్యూర్ డిపాజిట్లపై వరుసగా 7.15 శాతం, 7.15 శాతం, 7.40 శాతం వడ్డీ వస్తోంది. సీనియర్ సిటిజెన్లకు ఎస్‌బీఐ సర్వోత్తమ్ ఎఫ్‌డీ కింద ఏడాది టెన్యూర్‌పై 7.60 శాతం, రెండేళ్ల టెన్యూర్‌పై 7.90 శాతం వడ్డీ అందుతోంది.

# సిబిల్ స్కోరు లేకున్నా ఈజీగా రుణం పొందొచ్చు

భారత్‌లోని అన్ని బ్యాంకుల్లో దాదాపు అన్ని రకాల లోన్లు అందుబాటులో ఉంటాయి. హోం లోన్, వెహికిల్ లోన్, పర్సనల్ లోన్ ఇలా ఏది కావాలన్నా సిబిల్ స్కోరు అనేది తప్పనిసరి అన్న సంగతి తెలిసిందే. అయితే సిబిల్ స్కోరు లేకుండా కూడా పర్సనల్ లోన్ పొందే అవకాశం ఉంటుందా. క్రెడిట్ స్కోరు లేకున్నా కొన్ని ప్రత్యేక అంశాల్ని పరిగణనలోకి తీసుకొని లోన్లు అందిస్తుంటాయి. అత్యవసర సమయాల్లో డబ్బు కావాలంటే పర్సనల్ లోన్లు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పొచ్చు. తక్షణమే లోన్ కావాలంటే.. బ్యాంకులు మొదట చెక్ చేసేది అర్హతలు. అర్హతల విషయానికి వస్తే మొదట మంచి ఆదాయం ఉండాలి. మంచి సిబిల్ స్కోరు ఉండాలి. ఏ బ్యాంక్ అయినా లోన్ ఇచ్చే ముందు.. సదరు దరఖాస్తుదారు క్రెడిట్ హిస్టరీ (రుణ చరిత్ర) తెలుసుకుంటుంది. గతంలో మీరు తీసుకున్న లోన్ వివరాలు, గత చెల్లింపుల చరిత్ర, క్రెడిట్ కార్డుల వినియోగం ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని లోన్




ఇవ్వాలా వద్దా అని చూస్తుంటాయి. అయితే సిబిల్ స్కోరు లేకుండా లోన్ పొందొచ్చా? ఈ ఛాన్స్ ఉంది. అదెలాగో చూద్దాం.

సిబిల్ స్కోరు లేకున్నా లోన్ ఇవ్వాలంటే బ్యాంకులు రిస్క్‌గా భావిస్తాయి. అయితే కొన్ని బ్యాంకులు, ఇతర నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు మాత్రం సిబిల్ స్కోరు లేకున్నా లోన్ ఆఫర్ చేస్తుంటాయి. దీని కోసం కొన్ని ప్రత్యేక పద్ధతుల్ని అనుసరిస్తుంటాయి.ఇక్కడ మీరు లోన్ తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని.. మీ శాలరీ స్లిప్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్‌ను బట్టి అంచనా వేసి లోన్ మంజూరు చేయొచ్చు. మీకు ఏదైనా బ్యాంకులో శాలరీ అకౌంట్ ఉంటే.. మీ ఆర్థిక లావాదేవీల కు సంబంధించి రికార్డులు, వివరాలు వాటి దగ్గరే ఉంటాయి. ఇక్కడ ప్రీఅప్రూవ్డ్ లోన్లు లభించే అవకాశం ఉంటుంది. లోన్ ప్రాసెస్ కూడా వేగంగా జరుగుతుంది. కొన్ని రుణదాతలు సంప్రదాయ క్రెడిట్ స్కోరు కాకుండా ఇతర పద్ధతుల్ని అనుసరిస్తుంటాయి. మీ డిజిటల్ బ్యాంకింగ్ హిస్టరీ కావొచ్చు లేదా మీరు యుటిలిటీ బిల్స్ పేమెంట్ చేయడం వంటివాటిని పరిశీలిస్తాయి.మీ క్రెడిట్ స్కోరుతో పని లేకుండా గ్యారంటర్ సాయంతో లోన్ పొందొచ్చు. మీరు గ్యారంటర్‌గా పెట్టుకున్న వ్యక్తి రుణ చరిత్ర బాగుంటే సరిపోతుంది. మీకు సరైన క్రెడిట్ స్కోరు లేకపోయినా.. స్థిర ఆదాయం ఉందని నిరూపించగలిగితే రుణ సంస్థలు లోన్లు ఆఫర్ చేస్తాయి. దీని కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఆదాయపు పన్ను రిటర్న్స్ వంటివి సమర్పించాలి. ప్రధానంగా మీరు ఆర్థిక



క్రమశిక్షణ కలిగి ఉన్నారా లేదా అనే విషయమే చూస్తాయి.

ఇబ్బందులివే.. క్రెడిట్ స్కోరు చెక్ చేయకుండా రుణ సంస్థలు లోన్లు ఇచ్చేముందు మీరు కొన్ని అంశాల్ని పరిశీలించాల్సి ఉంటుంది. ఇక్కడ వడ్డీ రేట్లు ఇతర వాటితో పోలిస్తే ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. క్రెడిట్ స్కోరు 750 కంటే మెరుగ్గా ఉంటే చాలా బ్యాంకుల్లో తక్కువ వడ్డీకే లోన్లు వస్తాయి. సిబిల్ స్కోరు లేని సమయంలో రుణ దాతలు.. టెన్యూర్ ఎక్కువ కాలం ఇవ్వవు. అంటే తక్కువ కాలంలో నెలవారీగా పెద్ద మొత్తంలో ఈఎంఐలు చెల్లించాల్సి వస్తుంది. ఇది ఆర్థికంగా ఇబ్బందుల్ని సృష్టించే అవకాశం ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజులు సహా ఇతర టర్మ్స్ అండ్ కండీషన్స్ పేరిట ఎక్కువ రుసుములు వసూలు చేసే రిస్క్ ఉంటుంది.

# 93 ఏళ్ల వయసులో ఐదో పెళ్లి చేసుకోనున్న బిలియనీర్..

93 ఏళ్ల వయసులో పెళ్లికి సిద్ధమై బిజినెస్‌మెన్, బిలియనీర్ అయిన రూపర్ట్ మర్డోక్ మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఇప్పటికే నలుగురిని పెళ్లి చేసుకుని వారితో విడాకులు తీసుకున్న రూపర్ట్ మర్డోక్ ఐదోసారి పెళ్లికి సిద్ధం అయ్యారు. ఇటీవలే తన ప్రియురాలు 67 ఏళ్ల ఎలీనా జుకోవాతో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జూన్‌లో వీరిద్దరూ పెళ్లి చేసుకోనున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి.



ఫేమస్ ఆస్ట్రేలియన్–అమెరికన్ బిజినెస్‌మెన్, మీడియా టైకూన్, బిలియనీర్ రూపర్ట్ మర్డోక్ మరో పెళ్లికి సిద్ధం అయ్యారు. ఇప్పటికే 4 పెళ్లిళ్లు, 5 ఎంగేజ్‌మెంట్‌లు చేసుకున్న రూపర్ట్ మర్డోక్.. తాజాగా మరో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. ఇప్పటికే నలుగురు భార్యలకు విడాకులు ఇచ్చిన రూపర్ట్ మర్డోక్.. 93 ఏళ్ల వయసులో ఐదో వివాదం చేసుకునేందుకు రెడీ అయ్యారు. తన స్నేహితురాలు, 67 ఏళ్ల ఎలీనీ జుకోవాను మనువాడనున్నారు. వీరికి ఇటీవలె ఎంగేజ్‌మెంట్ కూడా జరిగినట్లు అమెరికా మీడియా వెల్లడించింది. దీంతో ఈ వివాహానికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్‌గా మారాయి. కాలిఫోర్నియాలోని తన ఎస్టేట్‌లో రూపర్ట్ మర్డోక్, ఎలీనీ జుకోవాను ఈ ఏడాది జూన్‌లో వివాహం చేసుకోనున్నట్లు ఆ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే ఈ పెళ్లి వేడుకకు హాజరయ్యేవారికి ఆహ్వాన పత్రికలు కూడా పంపించినట్లు సమాచారం. రూపర్ట్ మర్డోక్‌కు ఇప్పటికే 4 పెళ్లిళ్లు, 5 ఎంగేజ్‌మెంట్లు అయ్యాయి. గత సంవత్సరం ఆన్ లెస్లీ స్మిత్‌తో రూపర్ట్ మర్డోక్‌కు ఎంగేజ్‌మెంట్ కాగా.. నెల రోజుల లోపే వారిద్దరూ విడిపోయారు. దీంతో వారికి పెళ్లి జరగలేదు. దీంతో ఈ ప్రస్తుతం ఆరో ఎంగేజ్‌మెంట్ కాగా.. జూన్‌లో ఐదో వివాహం జరగనుంది.

కొన్ని నెలల కిందట రూపర్ట్ మర్డోక్‌కు మాజీ భార్య విన్‌డీ డెంగ్ ఇచ్చిన ఓ పార్టీలో ఎలీనీ జుకోవా.. ఆయనకు పరిచయం అయ్యారు. అప్పటి నుంచి వీరిద్దరూ డేటింగ్‌లో ఉండగా.. తాజాగా ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోనున్నారు. రష్యాకు చెందిన ఎలీనీ జుకోవా.. అమెరికాకు వలస వచ్చి స్థిరపడ్డారు. ఎలీనీ జుకోవాకు గతంలో మాస్కో ఆయిల్ బిలియనీర్ అయిన అలెగ్జాండర్‌తో పెళ్లి చేసుకుంది. వీరిద్దరికీ పుట్టిన కుమార్తె దాషా.. రష్యన్ ఓలిగార్క్‌ను వివాహం చేసుకోగా.. వారు తర్వాత విడాకులు తీసుకున్నారు. ఇక రూపర్ట్ మర్డోక్ విషయానికి వస్తే.. ఆయన మొట్టమొదట ఆస్ట్రేలియాకు చెందిన పాట్రిషియా బుకర్ అనే మహిళను పెళ్లి చేసుకోగా.. 1960 ల్లో వారు విడాకులు తీసుకుని దూరం అయ్యారు. ఆ తర్వాత జర్నలిస్ట్ అన్నా మరియా మన్‌ను పెళ్లి చేసుకుని విడిపోయారు. అనంతరం చైనా వ్యాపారవేత్త విన్‌డీ డెంగ్‌ను వివాహం చేసుకున్న రూపర్ట్ మర్డోక్ ఆమెకు కూడా విడాకులు ఇచ్చారు. ఆ తర్వాత అమెరికా మోడల్ జెర్రీ హాల్‌ను పెళ్లి చేసుకున్నా.. చివరికి ఆమెతో కూడా విడిపోయారు. ఇక తన రెండో భార్య జర్నలిస్ట్ అన్నా మరియా మన్ నుంచి విడిపోయిన సమయంలో రూపర్ట్ మర్డోక్ చెల్లించిన భరణం.. అత్యంత ఖరీదైన భరణాల్లో ఒకటిగా నిలిచింది. అప్పుడు 1.7 బిలియన్ డాలర్ల ఆస్తిని భరణంగా రాసి ఇచ్చినట్లు సమాచారం. 1950 ల్లో మీడియా కెరీర్‌ను ఆరంభించిన రూపర్ట్ మర్డోక్.. న్యూస్ ఆఫ్ ది వరల్డ్, ది సన్ న్యూస్ పేపర్లను ప్రారంభించారు. ఆ తర్వాత అమెరికాలో స్థిరపడి న్యూయార్క్ పోస్ట్, వాల్ స్ట్రీట్ జర్నల్ వంటి పబ్లికేషన్ సంస్థలను కొనుగోలు చేశారు. 1996 లో ఫాక్స్ న్యూస్‌ను ప్రారంభించిన రూపర్ట్ మర్డోక్.. 2013 లో న్యూస్‌కార్ప్ సంస్థను స్థాపించారు. ఇక తన కెరీర్‌లో అనేక వివాదాలు ఎదుర్కొన్న మర్డోక్.. 2011లో ఫోన్ హ్యాకింగ్ కుంభకోణం కారణంగా న్యూస్ ఆఫ్ ది వరల్డ్ పత్రికను మూసివేశారు. ఇక 2023 సెప్టెంబరులో తన వ్యాపారాలు మొత్తాన్ని కుమారులకు అప్పగించిన రూపర్ట్ మర్డోక్.. ప్రస్తుతం ఆయా సంస్థలకు గౌరవ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

**ఎలీనీ జుకోవాకు గతంలో మాస్కో ఆయిల్ బిలియనీర్ అయిన అలెగ్జాండర్‌తో పెళ్లి చేసుకుంది. వీరిద్దరికీ పుట్టిన కుమార్తె దాషా.. రష్యన్ ఓలిగార్క్‌ను వివాహం చేసుకోగా.. వారు తర్వాత విడాకులు తీసుకున్నారు. ఇక రూపర్ట్ మర్డోక్ విషయానికి వస్తే.. ఆయన మొట్టమొదట ఆస్ట్రేలియాకు చెందిన పాట్రిషియా బుకర్ అనే మహిళను పెళ్లి చేసుకోగా.. 1960 ల్లో వారు విడాకులు తీసుకుని దూరం అయ్యారు.**

# భారత్ అంటే అదే భయం, అదే అక్కసు.. 'జీ4 మోడల్' సాక్షిగా బుద్ధి బయటపెట్టిన పాకిస్థాన్

ఈ ప్రపంచంలో భారత్ ఎదుగుదలను జీర్ణించుకోని దేశాల జాబితా తీస్తే పాకిస్థాన్ ముందు ఉంటుంది. ఆ తర్వాతి స్థానం చైనాది అనుకోండి.. అది వేరే విషయం. ఐక్యరాజ్య సమితి సాక్షిగా.. భారత్ వ్యతిరేకతను పాకిస్థాన్ మరోసారి బయటపెట్టుకుంది. భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలని భారత్ సహా మిగతా దేశాలు డిమాండ్ చేస్తుండగా.. మన దేశానికి ఎక్కడ శాశ్వత సభ్యత్వం దక్కుతుందోనని పాకిస్థాన్ తెగ గింజుకుంటోంది. ఐరాసలో పాక్ రాయబారి స్పందనే దీనికి నిదర్శనం. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టాలని భారత్‌తోపాటు మిగతా దేశాలు ఎప్పటి నుంచో కోరుతున్న సంగతి తెలిసిందే కదా. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఐక్యరాజ్య సమితి ఏర్పాటు కాగా.. నాటి పరిస్థితులకు అనుగుణంగా భద్రతా మండలిలో ఐదు దేశాలకు శాశత్వ సభ్యత్వం కల్పించగా.. మరో పది దేశాలకు తాత్కాలిక సభ్యత్వం ఉంది. అయితే ఈ 80 ఏళ్లలో ప్రపంచం ఎంతగానో మార్పులొచ్చాయి. కొత్త ఆర్థిక శక్తులు పుట్టుకొచ్చాయి. దీంతో భద్రతా మండలిలో మార్పులు చేయాలని చాలా ఏళ్లుగా ప్రపంచ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, రష్యా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, చైనాలకు మాత్రమే వీటో అధికారం ఉంది. ఈ ఐదు దేశాల్లో ఏ ఒక్క దేశమైనా సరే తనకున్న 'వీటో' అధికారంతో కీలక తీర్మానాలకు అడ్డు తగలొచ్చు. భద్రతా మండలిని విస్తరిస్తే.. ప్రపంచంలోకెల్లా అత్యధిక జనాభా ఉన్న, ప్రపంచంలోని ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌కు కచ్చితంగా అందులో చోటు కల్పించాలి. ఇది ఇష్టం లేని చైనా ఏవేవో సాకులు చెబుతోంది. భారత్‌తోపాటు జపాన్, బ్రెజిల్, జర్మనీ దేశాలు జీ4 కూటమిగా ఏర్పాటై.. భద్రతా మండలిలో సంస్కరణల పట్ల స్వరం వినిపిస్తున్నాయి. ఈ నాలుగు దేశాల తరఫున తరఫున ఐక్యరాజ్య సమితిలోని భారత రాయబారి రుచిరా కాంబోజ్ 'జీ–4 మోడల్' గురించి మిగతా సభ్య దేశాలకు వివరించారు. భద్రతా మండలి సంస్కరణపై ప్రభుత్వాల మధ్య చర్చ (ఇంటర్‌గవర్నమెంటల్ నెగోషియేషన్స్ ఆన్ సెక్యూరిటీ కౌన్సిల్ రిఫార్మ్స్ – ఐజీఎన్)ల్లో పాల్గొన్న సందర్భంగా రుచిరా జీ–4 మోడల్



గురించి ప్రసంగించారు.

1945 నాటి భౌగోళిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా భద్రతా మండలి ఏర్పాటైందని.. అప్పటితో పోలిస్తే ప్రపంచంలో ఎన్నో మార్పులొచ్చాయని భారత్ స్పష్టం చేసింది. దీంతో భద్రతా మండలిని విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రస్తుతం భద్రతా మండలిలో 15 దేశాలకు సభ్యత్వం ఉండగా.. దీన్ని 25–26కు పెంచాలని సూచించింది. కొత్తగా ఆరు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించాలని.. ప్రస్తుతమున్న పది దేశాలకు అదనంగా మరో 4 లేదా 5 దేశాలకు తాత్కాలిక సభ్యత్వం కల్పించాలని భారత్ డిమాండ్ చేసింది. ఆఫ్రికా, ఆసియా నుంచి రెండు దేశాలు చొప్పున, లాటిన్ అమెరికా అండ్ కరేబియన్ దేశాల నుంచి ఒక దేశానికి, పశ్చిమ యూరప్ ఇతర ప్రాంతాల నుంచి మరో దేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలని భారత్ ప్రతిపాదించింది. అయితే ఏ దేశానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలనే విషయాన్ని మాత్రం జీ4 మోడల్ చెప్పడం లేదని భారత రాయబారి రుచిరా తెలిపారు. కొత్తగా శాశ్వత సభ్యత్వం పొందే దేశాలకు ఇప్పటి శాశ్వత సభ్యదేశాల్లాగే అన్ని హక్కులు, బాధ్యతలు ఉంటాయని.. అయితే వీటో విషయంలో సమీక్షించి ఓ నిర్ణయం తీసుకునే వరకు కొత్తగా సభ్యత్వం పొందే దేశాలు వీటోను ఉపయోగించవని జీ–4 మోడల్ పేర్కొంది. అంతే కాదు చైనా తనకున్న వీటో అధికారంతో సంస్కరణలకు అడ్డు తగిలే అవకాశం ఉండటంతో.. మండలి సంస్కరణల విషయంలో వీటో చేయడానికి అనుమతించొద్దని కూడా సూచించింది. వచ్చే ఏడాది ఐరాస 80వ వార్షికోత్సవం ఉన్న నేపథ్యంలో భద్రతా మండలిలో సంస్కరణలు చేపట్టడానికి ఇదే మంచి సమయమని.. ప్రపంచ దేశఆలు, భావితరాలు ఇంకెంతో కాలం ఎదురు చూడలేవని కాంబోజ్ స్పష్టం చేశారు. చారిత్రకంగా జరిగిన అన్యాయాలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో.. వాటిని సరిచేయా ల్సిన అవసరం ఉందన్నారు. భారత్ ప్రతిపాదించిన జీ–4 మోడల్‌ను ఫ్రాన్స్ స్వాగతించగా.. అమెరికా సైతం సుముఖత వ్యక్తం చేసింది. భారత్ జీ–4 మోడల్‌ను ప్రజెంట్ చేయగానే.. పాకిస్థాన్ దాన్ని వ్యతిరేకించింది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కడం ఏమాత్రం ఇష్టం లేని పాకిస్థాన్ మరోసారి తన బుద్ధిని బయటపెట్టుకుంది. జీ–4 మోడల్ అప్రజాస్వామికమని, దానికి జవాబుదారీతనం లేనిదని, అసమానతలను పెంచేలా ఉందని దాని వల్ల నష్టం తప్పితే లాభం లేదని ఐరాసలోని పాకిస్థాన్ రాయబారి మునీర్ అక్రమ్ ఆరోపించారు. భద్రతా మండలిలో మార్పులకు తాము వ్యతిరేకమని పాకిస్థాన్ తెలిపింది. భద్రతా మండలిలో మార్పులు చేయాలంటున్న జీ–4 దేశాల ప్రతిపాదన వెనుక ఆంతర్యం ఏంటని మునీర్ ప్రశ్నించారు. జీ–4 మోడల్ ప్రపంచాన్ని వ్యతిరేక దిశలో నడిపిస్తుందని.. కొత్తగా ఆరు దేశాలకు శాశ్వత సభ్యత్వం కల్పించి.. 5 దేశాలకు మాత్రమే తాత్కాలిక సభ్యత్వం కల్పిస్తే.. శాశ్వత, తాత్కాలిక సభ్య దేశాల మధ్య నిష్పత్తి సగానికి తగ్గుతుందని.. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందలేని మిగతా 182 దేశాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు తగ్గుతాయని పాకిస్థాన్ రాయబారి చెప్పారు. ఇప్పుడున్న తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను పది నుంచి 15–16కి పెంచితే ప్రపంచ దేశాల ప్రాతినిధ్యం ఎలా తగ్గుతుందో ఆ పాకిస్థాన్ రాయబారికే తెలియాలి. పాకిస్థాన్ ఉద్దేశం మంచిదే అయితే.. తాత్కాలిక సభ్య దేశాల సంఖ్యను ఇంకా పెంచాలనే సూచన చేయాలని తప్పితే.. జీ–4 మోడల్‌నే తప్పుబట్టడం అనేది.. భారత్ పట్ల ఆ దేశానికి ఉన్న భయాన్ని బయటపెట్టేలా ఉంది తప్పితే మరొకటి కాదు.


# టూత్‌పేస్ట్‌తో పళ్లేకాదు.. ఇవి కూడా మెరిపించేయండి..!



మన పళ్లను తళతళ మెరిపించడమే కాదు.. ఇంకా చాలా పనులే చేస్తుంది. టూత్‌పేస్ట్ ఇంకా ఎన్ని రకాలుగా వాడుకోవచ్చు.. ఏమి శుభ్రం చేయడానికి ఉపయోగ పడుతుందో ఈ స్టోరీలో చూద్దాం. కొన్నిసార్లు అనుకోకుండా కాఫీ కప్పు చేయి జారి.. నేలపై పడితే ఈజీగానే శుభ్రం చేసుకోవచ్చు. కానీ, అవి గోడ మీద పడితేనే.. ఆ మరకలను తొలగించడం చాలా కష్టం. ఈ మరకలను తొలగించడానికి టూత్‌పేస్ట్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. గోడపై టూత్‌పేస్ట్ మరకలను తొలగించడానికి.. టూత్‌పేస్ట్‌ను మరకలపై అప్లై చేసి రుద్దండి. అలా కొన్ని నిమిషాలు వదిలేసి.. ఆ తర్వాత తడి క్లాత్‌తో తుడవండి. ఇలా చేస్తే మరకలు మాయం అవుతాయి. వెండి సామన్లు క్లీన్ చేయడానికి చాలా కష్టపడుతుంటారు. టూత్‌పేస్ట్‌తో వెండి సామాన్లను తళతళ మెరిపించవచ్చు. టూత్‌పేస్ట్‌ను వెండి సామాన్లకు అప్లై చేసి.. ఆ తర్వాత తడి చేసుకుంటూ బ్రష్‌తో రుద్దండి. ఆ తర్వాత నీళ్లతో శుభ్రం చేయండి. ఇలా చేస్తే.. వెండి సామాన్లు నలుపు పోయి.. మంచిగా మెరుస్తాయి.

తెల్ల షూస్ త్వరగా మాసిపోతాయ్. వీటిని పూర్వస్థితికి తీసుకురావడం కాస్త కష్టమనే చెప్పాలి. మీ వైట్ షూస్ తిరిగి మెరవాలంటే.. టూత్ పేస్ట్ సహాయపడుతుంది. చెంచా చొప్పున వైట్ టూత్‌పేస్ట్, బేకింగ్ సోడా తీసుకొని, కొద్దిగా నీటిని కలిపి మరకలు ఉన్న చోట రాయండి. నీటితో తడి చేసుకుంటూ బ్రష్‌తో రుద్ది, ఆపై తడి వస్త్రంతో తుడిస్తే కొత్తవాటిలా మెరుస్తాయి. ఫోన్ ట్రాన్స్‌పరెంట్ కవర్లు.. కొన్ని రోజుల తర్వాత పసుపు రంగులోకి మారతాయి. వాటిని తిరిగి మెరిపించడానికి.. టూత్‌పేస్ట్ సహాయపడతాయి. మీ ఫోన్ కవర్ మీద.. దాని మీద కొన్ని నీళ్లను చిలకరించి, తెల్లని పేస్టుతో రుద్ది కాసేపు అలా వదిలేయండి. తర్వాత నీటితో శుభ్రం చేస్తే కొత్తదానిలా కనిపిస్తుంది.

# ఈ 3 పనులు చేసేవారికి త్వరగా ముసలితనం వస్తుందట..











ఎన్ని ఏళ్ళొచ్చినా యంగ్‌గా కనిపించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ, తెలిసీతెలియక చేసే కొన్ని తప్పుల వల్ల త్వరగా ముసలివారైపోతారట.. అవేంటో తెలుసుకోండి. ఈ 3 పనులు చేసేవారికి త్వరగా ముసలితనం వస్తుందట..వయసు పెరుగుతుందంటే ఎవరికైనా అందంగా కనిపించే విషయంలో కాస్త భయమే ఉంటుంది. అందుకే ఎప్పుడు కూడా చిన్నవారిగానే కనిపించేందుకు యంగ్ లుక్‌ని ఇచ్చే క్రీమ్స్, ప్రోడక్ట్స్ వాడడం, మంచి డైట్, ఎక్సర్‌సైజ్ చేయడం వంటి ఫాలో అవుతారు. తమని తాము చిన్నవారిలా చూసుకునేందుకు ఆరాటపడతారు. కొన్ని తప్పులు చేయకుండా ఉండాలి. అవేంటో తెలుసుకోండి.

ఎక్కువగా పని.. సామర్థ్యానికి మించిన పని చేయడం వల్ల త్వరగా వృద్ధాప్య ఛాయలు కనిపించేలా చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఏ పని అయినా పట్టుదలతో పాటు క్రియేటివిటీగా చేస్తే త్వరగా పనులు పూర్తవ్వడమే కాకుండా శ్రమ తగ్గుతుంది. కాబట్టి, స్మార్ట్‌గా ఆలోచించి అలా పనిచేయడం చాలా ముఖ్యం. అతిగా తినడం.. మనం ఆరోగ్యంగా ఉండడానికి ఆహారం ఎంత ముఖ్యమో, అందంగా కనిపించడంలోనూ డైట్ అంతే కీ రోల్ పోషిస్తుంది. ఆహారం ఎంత తినాలో తెలిసి ఉండడం చాలా ముఖ్యం.

ఫుడ్ ఎక్కువగా తిన్నా, తక్కువగా తిన్నా అంత మంచిది కాదు. ముఖ్యంగా ఎక్కువగా తిన్నామంటే బరువు పెరిగి త్వరగా ముసలి వారిలా కనిపిస్తారని చెబుతున్నారు నిపుణులు.

నిద్ర.. ఇది కూడా త్వరగా ముసలివారిలా కనిపించేలా చేస్తుంది. ఎక్కువగా నిద్ర పోయినా, అసలే నిద్రలేకపోవ డం వల్ల అకాల వృద్ధాప్యం వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే నిద్రసరిగ్గా ఉండేలా చూసుకోండి.

చివరిగా.. వృద్ధాప్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వస్తుంది. దానికి కంగారు పడాల్సిన అవసరం లేదు. కానీ, మనసులో ముసలితనం వచ్చినట్టుగా ఫీల్ అయితే వయసులో కూడా ముసలివారిలానే ఫీల్ అవుతారు. కాబట్టి, థింక్ యంగ్.. స్టే యంగ్..

# గ్యాస్, ఎసిడిటీ సమస్యలు రావు..!







ఈ రోజుల్లో పని ఒత్తిడిని తట్టుకోవాలంటే.. ఏడాదికి ఒకసారైనా టూర్లకు వెళ్లాల్సి ందే. తెలియని ప్రదేశాలకు వెళ్తే.. మనలో తెలియని ఉత్సాహం నిండుతుంది. ఈ రోజుల్లో చాలామంది గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలతో ఇబ్బంది పడుతు న్నారు. ఇలాంటి వారు టూర్స్‌కు వెళ్లినప్పుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. జీర్ణ సమస్యల వల్ల.. టూర్ కూడా సరిగ్గా ఎంజాయ్ చేయలేరు. విహారయాత్రకు వెళ్లేవారు.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యలు ఉండవని నిపుణులు అంటున్నారు. బ్రేక్‌ఫాస్ట్ తక్కువ గా తినండి..కొంతమంది బ్రేక్‌ఫాస్ట్ హెవీ గా తింటూ ఉంటారు. టూర్లకు వెళ్లినప్పు డు హెవీగా తింటే.. రోజంగా హెవీగా, ఇబ్బందిగా అనిపిస్తుంది. దీంతో, ఏ పనీ సరిగ్గా చేయలేరు. బ్రేక్‌ఫాస్ట్ తక్కువగా తిన్నా.. త్వరగా నీరసం వచ్చేస్తుంది. మీరు టూర్‌లో ఉన్నప్పుడు మీ బ్రేక్‌ఫాస్ట్‌లో నట్స్, డ్రై ఫ్రూట్స్ వంటి బలవర్ధకమైన ఆహారం చేర్చుకోండి. ఇలా చేస్తే.. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు.

ఫ్రెష్ ఫుడ్ తినొచ్చు.. కొంతమంది టూర్లకు వెళ్లినప్పుడు.. లోకల్ ఫుడ్ తినడానికి జంకుతారు. అవి పడకపోతే.. హెల్త్ పాడవుతుందని అనుకుంటూ ఉంటారు. అయితే తాజాగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదంటున్నారు నిపుణులు. ఒకేసారిగా కాకుండా.. మితంగా ఎక్కువసార్లు తింటే మంచిది.

ఇంటి నుంచి తీసుకెళ్లండి.. కొంతమందికి బయట ఫుడ్ పడదు. కాబట్టి, ఇంటి నుంచే కొన్ని రకాల పదార్థాలను తీసుకెళ్లడం మంచిదంటున్నారు నిపుణులు. ఒకవేళ బయట ఫుడ్ తిన్నా.. ఒకేసారి ఎక్కువగా కాకుండా తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు తింటే ఎలాంటి సమస్యా ఉండదు. కొంతమంది అజీర్తి సమస్యలతో టూర్ ఎంజాయ్ చేయలేరు. ఇలాంటి వారు వారి డైట్‌లో పెరుగు తప్పకుండా తీసుకోవాలి. అలాగే శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం కోసం క్రమం తప్పకుండా నీళ్లు తాగుతుండాలి.

# కాలి గోర్ల చివర్లలో నొప్పి, వాపుగా ఉందా..











చాలా మందికి కాలి బొటనవేళ్ళల్లో నొప్పిగా ఉంటుంది. చివర్లకి వాపు వచ్చి నొప్పిగా అనిపిస్తుంది. దీనికి గోళ్ళ ఫంగస్ కారణం. మరి దీనికి ఎలాంటి టిప్స్ పాటించాలో ఇప్పుడు చూద్దాం. నెయిల్ ఫంగస్. గోర్లలో ఫంగస్ కారణంగా చాలా సార్లు సమస్య వస్తుంది. దీంతో వేళ్ళలో నొప్పి ప్రారంభమవుతుంది. అది అలానే కొనసాగితే గోర్ల ఆకృతి, రంగు కూడా మారుతుంది. దీనికి చక్కని ఇంటి చిట్కాలు ఉన్నాయి. వీటిని ఫాలో అయితే సమస్య చాలా త్వరగా తగ్గిపోతుంది. కారణాలు.. గోర్ల నొప్పి, పుండ్లు కావడానికి కొన్నిసార్లు సరిగా క్లీన్ చేయకపోవడం, ఇన్ గ్రోన్ టో నెయిల్స్ కారణంగా సమస్య వస్తుంది. చాలా మంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. దీని వల్ల నొప్పి ఇబ్బందిగా ఉంటుంది. ఈ సమస్యని ఇంట్లోనే తగ్గించుకోవచ్చు. అవేంటో తెలుసుకోండి.

యాపిల్ సైడర్ వెనిగర్.. ఇందులో ఎక్కువగా యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కాస్తా నీటిలో యాపిల్ సైడర్ వెనిగర్ వేసి అందులో పాదాలని ఉంచండి. ఎసిటిక్ యాసిడ్ అనే సమ్మేళనం ఏండే ఈ వెనిగర్ మీ యాసిడ్ ఇన్ఫెక్షన్ వ్యాప్తిని తగ్గించడంలో హెల్ప్ అవుతుంది. దీని వాసనని తట్టుకోలేని వారు ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కలపొచ్చు.

బ్లాక్ టీ.. గోళ్ళ ఫంగస్ సమస్యని దూరం చేసేందుకు బ్లాక్ టీ కూడా టానిక్‌లా పని చేస్తుంది. ఇది గోళ్ళ ఫంగస్, ఇన్ఫెక్షన్ పెరుగుదలని తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. దీని కోసం మీరు డీకాషన్ తయారు చేసి అది గోరువెచ్చగా అయ్యాక కాళ్ళని అందులో నానబెట్టండి.

వెల్లుల్లి.. వెల్లుల్లి శక్తివంతమైన యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇందులో అలిసిన్ అనే యాంటీ ఫంగల్ ఏజెంట్ ఉంది. దీనిని నేరుగా దంచి పెట్టడం లేదా రసం రాయండి. అరగంట అలానే ఉంచి తర్వాత క్లీన్ చేయండి.

బేకింగ్ సోడా.. బేకింగ్ సోడా ఫంగస్‌కి కారణమయ్యే తేమని గ్రహించగలదు. బేకింగ్ సోడాను కొద్దిగా నీటితో కలిపి పేస్టులా చేయండి. దీనిని ఇన్‌గ్రోన్ గోర్ల చుట్టూ రాయండి. 15 నుండి 20 నిమిషాల పాటు ఉంచి తర్వాత గోరువెచ్చని నీటితతో క్లీన్ చేయండి.


నిమ్మరసం.. అనేక రకాల ఆరోగ్య సమస్యలకి పరిష్కారమని చెప్పొచ్చు. ఇన్ఫెక్షన్లని దూరం చేయడానికి నిమ్మరసం బాగా పనిచేస్తుంది. నిమ్మరసాన్ని రాయడం వల్ల సమస్య చాలా వరకూ తగ్గుతుంది.

# యాంటీ ఆక్సిడెంట్ రిచ్ డైట్..









రోజంతా అలసటగా అనిపిస్తుందా..? ఎలాంటి కారణంగా లేకుండాకండరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారా..? మీ చర్మం నిర్జీవంగా మారిందా..? నీరసంగా, నిస్సత్తువగా ఉంటుందా..? మీ సమాధానం అవునూ అయితే.. మీ ఆహారంలో యాంటీఆక్సిడెంట్లను ఎక్కువగా తీసుకోవాలి. యాంటీఆక్సిడెంట్లు.. మీ శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి రక్షించడానికి సహాయపడతాయి. మనం రోజూ తీసుకునే ఆహారం ద్వారా ఉత్పత్తి అయ్యే టాక్సిన్స్, ఆక్సిడెంట్లను బయటకు పంపడంలో యాంటీఆక్సిడెంట్లు కీలక పాత్ర పోషిస్తాయి. మన శరీరంలో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుంటే.. ఇమ్యూనిటీ వీక్ అవుతుంది, ఆరోగ్యం క్షీణిస్తుంది. అందుకే, మన డైట్‌లో యాంటీఆక్సిడెంట్ రిచ్ ఆహారం తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. యాంటీఆక్సిడెంట్ వల్ల టాక్సిన్స్‌ను తొలగిస్తుంది.. హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం శరీరంలో పేరుకున్న టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు తమ స్వంత ఎలక్ట్రాన్‌లను దానం చేసి.. ఫ్రీ రాడికల్స్‌ను న్యూట్రల్ చేస్తుంది. ఈ ప్రక్రియ మీ శరీర కణాలలోని.. ఇతర అణువులకు హాని కలిగించే.. ఆక్సిడెంట్ల గొలుసు ప్రతిచర్యను విచ్ఛిన్నం చేస్తుంది.

శక్తిని మెరుగుపరుస్తుంది.. ఇది శరీరాన్ని డిటాక్స్ చేసి.. శరీర సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇది మీ శరీరానికి శక్తిని అందిస్తుంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ బయోకెమిస్ట్రీ న్యూట్రిషన్‌లో ప్రచురించిన పరిశోధన ప్రకారం, యాంటీఆక్సిడెంట్-రిచ్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల "ఏరోబిక్ గ్లూకోజ్ మెటబాలిజం" ద్వారా శక్తి ఉత్పత్తిని పెంచవచ్చు.

గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.. యాంటీఆక్సిడెంట్లు.. శరీర కణాలను నాశం చేసే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తుంది, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుంది. ఇది ధమనుల ద్వారా రక్తం, ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపరుస్తుందని, గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుందని.. అధ్యయనాలు చెబుతున్నాయి.

చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.. యాంటీఆక్సిడెంట్లు.. చర్మాన్ని సూర్యరశ్మి నుంచి రక్షిస్తాయి. మీ కణాలలో రక్త ప్రసరణను పెంచుతాయి, చర్మ తేమను నిర్వహిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు.. వృద్ధాప్య ఛాయలు తర్వగా రాకుండా అడ్డుకుంటాయి.

కంటి చూపును రక్షిస్తాయి.. పీర్ - రివ్యూడ్ జర్నల్ ప్రకారం ఆకుపచ్చ కూరగాయలలో ఉండే.. లుటిన్, జియాక్సింతిన్ వంటి పోషకాలు యాంటీఆక్సిడెంట్‌లుగా పనిచేస్తాయి. ఇవి కంటి సంబంధిత సమస్యల ముప్పును తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. విటమిన్ సి, ఇ కూడా యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి కంటి సమస్యలను నివారిస్తాయి.

ఈ ఫుడ్స్‌లో ఉంటాయి.. యాంటీ ఆక్సిడెంట్లు ఆహారం ద్వారానే వస్తాయి. ఆకు కూరలు, కాయగూరలు, పండ్లలోనే ఇవి లభిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు.. ఎక్కువగా క్యారెట్, క్యాబేజీ, టమాట, ఉల్లి, దుంపలు, బీన్స్, చిక్కుళ్లు, యాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బొప్పాయి, గ్రీన్ టీ, ఆలీవ్ ఆయిల్, తెనే లాంటి వంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా కనిపిస్తాయ్.

# బొప్పాయి జ్యూస్ తాగితే ఈ లాభాలన్నీ పక్కా..









బొప్పాయి పండు ఆరోగ్యానికి హెల్ప్ చేస్తుంది. దీనిని తాగడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి. రోజూ బొప్పాయి జ్యూస్ తాగితే ఈ లాభాలన్నీ పొందడం పక్కా.. పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టపడే పండ్లలో బొప్పాయి పండు ఒకటి. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ బొప్పాయి రసాన్ని 30 నుండి 50మిల్లీ లీటర్ల వరకూ రోజూ తీసుకుంటే కొన్ని లాభాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు నిపుణులు.

హెల్త్ బెనిఫిట్స్.. బొప్పాయి పండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఆకలి కంట్రోల్ అవుతుంది. దీంతో బరువు తగ్గుతుంది. దీంతో పాటు జీవక్రియని మెరుగ్గా చేస్తుంది. ఇది ముఖ్యంగా పిల్లల్లో కడుపులోని పురుగులని చంపుతుంది. దీంతో పాటు చాలా లాభాలు ఉన్నాయి.

పీరియడ్ పెయిన్స్.. బొప్పాయిలో గర్భాశయంలోని వ్యర్థాలు, ట్యాక్సిన్స్‌ని బయటకు పంపే శక్తి ఉంది. ఇది రుతుస్రావం సమయంలో వ్యర్థాలను బయటకు పంపుతుంది. కడుపు నొప్పిని తగ్గిస్తుంది. గర్భం దాల్చాలనుకునే మహిళలు దీనికి దూరంగా ఉంటే చాలా మంచిది. దీనిని రోజుకి 30 మిల్లీగ్రాముల వరకూ తీసుకోవచ్చు. ఇందులో హార్మోన్ల అసమతుల్యతని కూడా హెల్ప్ చేస్తుంది.

బొప్పాయిలో విటమిన్ ఎతో పాటు యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. కాబట్టి, జ్యూస్‌ని తక్కువగా మోతాదులో ఉంటాయి. ముఖ్యంగా పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

శరీర బరువు తగ్గడం.. పండ్లు బరువు తగ్గించేందుకు బొప్పాయి పండు హెల్ప్ చేస్తుంది. ఇందులోని ఫైబర్ ఎక్కువగా ఉండడం చాలా మంచిది. దీని వల్ల జీర్ణ సమస్యలు, మలబద్ధకం దూరమవుతుంది. ఇందులో విటమిన్ ఎ సహా పోషకాలు ఉంటాయి. దీంతో జీర్ణక్రియ పెరిగి చెడు కొలెస్ట్రాల్ కొవ్వుని తగ్గిస్తుంది. రోజూ ఉద యాన్నే బొప్పాయి తీసుకుంటే బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తుంది. చర్మ కాంతి చర్మాన్ని అందంగా మార్చడంలోనూ ఈ పండ్లు చాలా కీ రోల్ పోషిస్తాయి. ఇందులో విటమిన్ ఎ, పొటాషియలు ఉన్నాయి. ఇవి చర్మ సమస్యల్ని దూరం చేసి చర్మాన్ని హైడ్రేట్ చేస్తాయి. ఇది చర్మంలో మృతకణా లను దూరం చేసి ముఖానికి రక్త ప్రసరణ పెంచి డార్క్ కాంప్లెక్షన్ ని తగ్గించి మంచి రంగు వస్తుంది. ఇమ్యూనిటీ.. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఇమ్యూనిటీని పెంచుతాయి. దీంతో చాలా వరకూ సీజనల్ సమస్యలు, జ్వరం, జలుబు వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.



# గుడ్ న్యూస్ చెప్పిన వరుణ్ లావణ్య

మెగా ఇంట్లో మళ్లీ ఆనందం వెల్లివిరేసే సమయం ఆసన్నమైంది. వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి త్వరలోనే తల్లిదండ్రులు కాబోతోన్నారు. లావణ్య త్రిపాఠి, వరుణ్ తాజాగా గుడ్ న్యూస్‌ను షేర్ చేశారు. వీరిద్దరికీ రెండేళ్ల క్రితం పెళ్లి అయిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ఎవరి ప్రాజెక్టులతో వారు బిజీగా ఉన్నారు. మరి లావణ్య ఇలా గుడ్ న్యూస్ ప్రకటించడంతో అభిమానులు సంతోషంలో మునిగి తేలుతున్నారు. మెగా ఫ్యామిలీ నుంచి కూడా విషెస్ వెల్లువెత్తుతున్నాయి.

మెగా ఫ్యామిలీలో మళ్లీ ఆనందం వెల్లువెత్తబోతోంది. వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి త్వరలోనే తల్లిదండ్రులు కాబోతోన్నారు. లావణ్య త్రిపాఠి, వరుణ్ తేజ్ తాజాగా ఓ గుడ్ న్యూస్ చేశారు. ఇక తాను ప్రెగ్నెంట్ అంటూ లావణ్య త్రిపాఠి షేర్ చేసిన పోస్టుకి సెలెబ్రిటీలు స్పందిస్తున్నారు. అల్లు స్నేహా రెడ్డి, రీతా వర్మ, బెల్లంకొండ శ్రీనివాస్, రకుల్ ప్రీత్ ఇలా అందరూ కంగ్రాట్స్ చెబుతున్నారు. లావణ్య, వరుణ్ తేజ్‌లకు 2023లో వివాహం జరిగిన సంగతి తెలిసిందే.

గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఈ విషయం మీద వార్తలు వస్తూనే ఉన్నాయి. గుడ్ న్యూస్ చెప్పబోతోన్న లావణ్య త్రిపాఠి, తండ్రి కాబోతోన్న వరుణ్ తేజ్ అంటూ వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇక ఇప్పుడు ఈ జంట ఇలా ఈ గుడ్ న్యూస్‌ను అధికారికంగా ప్రకటించేసింది. ఇక మెగా ఫ్యామిలీలోకి మరో బిడ్డ రాబోతోంది. నాగబాబు తాత కాబోతోన్నాడు. ఈ గుడ్ న్యూస్ మీద టాలీవుడ్ సెలెబ్రిటీలంతా రియాక్ట్ అవుతున్నారు. సమంత, సుధీర్ బాబు, సుశాంత్, డింపుల్ హయతి వంటి వారంతా కూడా రియాక్ట్ అవుతున్నారు. అంతా కంగ్రాట్స్ అని కామెంట్లు పెడుతున్నారు. ఇక మెగా ఫ్యామిలీ ఇంట్లో మళ్లీ కేరింతలు వినిపించే సమయం అతి దగ్గర్లో ఉంది. క్లీంకారతో ఆడుకునేందుకు ఓ చిట్టి తమ్ముడో, చెల్లో రాబోతోందన్న మాట.

వరుణ్ తేజ్ పెళ్లి తరువాత చేసిన సినిమా వర్కౌట్ కాలేదు. మట్కా వచ్చి దారుణంగా దెబ్బ తిన్నాడు. రూట్స్ అంటూ మాట్లాడి బన్నీ ఫ్యాన్స్ చేతిలో బుక్కయ్యాడు. వరుణ్ తేజ్ ఇప్పుడు ఓ హిట్టు కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసలు వరుణ్ తేజ్ ఖాతాలో హిట్టు పడి చాలా కాలమే అవుతోంది. ఇక లావణ్య త్రిపాఠి అయితే ఇప్పుడు సినిమాలు చేసే పరిస్థితి లేదు. మరి ఆమె ఆల్రెడీ సతీ లీలావతి అనే ఓ మూవీని చేస్తోంది. ఆ చిత్రానికి సంబంధించిన షూటింగ్ చాలా వేగంగానే జరుగుతూ వచ్చింది. మరి ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌ను లావణ్య మధ్యలో వదిలేస్తుందా? లేదంటే ఆల్రెడీ షూటింగ్ ఫినిష్ అయిందా? అన్నది తెలియాల్సి ఉంది. మిస్టర్, షూజీ అంటూ వరుసగా చిత్రాలు చేసిన తరువాత వీరిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం చివరకు ప్రేమగా మారి.. పెళ్లి వరకు దారి తీసిన సంగతి తెలిసిందే.

# తిరిగి వచ్చిన మ్యాన్ ఆఫ్ మాసెస్



ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబోలో పవర్ ఫుల్ మాస్ ఎంటర్టైనర్ రాబోతోన్న సంగతి తెలిసిందే. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో ఈ ఎన్టీఆర్, నీల్ ప్రాజెక్ట్ ఉంటుందని సమాచారం. ఇప్పటికే షూటింగ్‌ను స్టార్ట్ చేశాడు ప్రశాంత్ నీల్. రీసెంట్ గానే ఎన్టీఆర్ సెట్స్‌లోకి జాయిన్ అయిన సంగతి తెలిసిందే. ఈ మూవీకి కోసం ఎన్టీఆర్ తన లుక్ పూర్తిగా మార్చుకున్న సంగతి తెలిసిందే. పూర్తిగా బక్క చిక్కినట్టుగా స్లిమ్ లుక్‌లోకి మారిపోయాడు. ఇక ఎన్టీఆర్ ఇప్పుడు ఫస్ట్ షెడ్యూల్‌ను ఫినిష్ చేసుకున్నాడని సమాచారం. దీంతో వెంటనే హైదరాబాద్‌కు ఎన్టీఆర్ వచ్చేశాడు. ఎయిర్ పోర్టులో ఎన్టీఆర్ ఇలా కనిపించడంతో అలా కెమెరాలు క్లిక్‌మనిపించాయి.. ఆ ఫోటోలు వెంటనే నెట్టింట్లో వైరల్ కాసాగాయి. ఇక ఈ సమ్మర్‌లో ఫ్యామిలీతోనే ఎన్టీఆర్ ఉండబోతోన్నాడని టాక్.

లఎన్టీఆర్ అసలే దేవర తరువాత చాలా టైం తీసుకున్నాడు. కాస్త నిదానంగానే సినిమాల్ని మొదలు పెట్టాడు. దేవరకు మిక్స్‌డ్ టాక్ వచ్చినా కూడా కలెక్షన్లలో మాత్రం అదరగొట్టేసింది. 500 కోట్ల క్లబ్బులో దేవర జాయిన్ అయిన సంగతి తెలిసిందే. ఇక దేవర మూవీ తరువాత ఎన్టీఆర్ కాస్త గ్యాప్ తీసుకున్నాడు. అంత లోపు ప్రశాంత్ నీల్ ప్రీ ప్రొడక్షన్ పనుల్ని చూసుకున్నాడు. ఆ గ్యాప్‌లోనే దేవర జపాన్ ప్రమోషన్స్‌ను ఎన్టీఆర్ చేసుకుని వచ్చాడు.దేవర ప్రమోషన్స్‌లో బయటకు రాని ఎన్టీఆర్.. మ్యాడ్ 2, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతీ కోసం బయటకు వచ్చాడు. ఇక మ్యాడ్ 2 ఈవెంట్లో ఎన్టీఆర్ మాట్లాడిన మాటలు, ఇచ్చిన స్పీచులు ఎంతగానో వైరల్ అయ్యాయి. అప్పటి వరకు దేవర 2 మీద చాలా మందికి అనుమానాలు ఉండేవి. దేవర 2 కచ్చితంగా వస్తుందని ఎన్టీఆర్ బల్లగుద్ది మరీ చెప్పాడు. అయితే ఇప్పుడు మాత్రం వార్ 2, ప్రశాంత్ నీల్ ప్రాజెక్టుల్ని ఫినిష్ చేయాల్సి ఉందని అన్నాడు.

ఎన్టీఆర్, నీల్ ప్రాజెక్ట్ తరువాత నెల్సన్‌తో ప్రాజెక్ట్ ఉంటుందని తెలుస్తోంది. ఇవన్నీ పూర్తి అయిన తరువాతే కొరటాల శివతో దేవర 2 మూవీని ఎన్టీఆర్ చేస్తాడు. ఇక ఈ ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ చిత్రానికి సంబంధించిన ఇతర క్యాస్టింగ్ వివరాలు అయితే బయటకు రావడం లేదు. హీరోయిన్, విలన్, ఇతర తారాగణం వంటి వాటిపై చిత్రయూనిట్ ఇంత వరకు అధికారికంగా ప్రకటనలు చేయడం లేదు. రవి బస్రూర్ మాత్రం ఇప్పటికే ఈ ఎన్టీఆర్, నీల్ ప్రాజెక్ట్ గురించి హైప్ ఎక్కించేశాడు. ఈ చిత్రానికి డ్రాగన్ అనే టైటిల్ పరిశీలనలో ఉందని అందరికీ తెలిసిందే. మరి ఆ విషయాన్ని కూడా టీం ఇంకా కన్ఫామ్ చేయడం లేదు. చూస్తుంటే తారక్ బర్త్ డే (మే 20) సందర్భంగా చాలానే సర్ ప్రైజ్‌లు ఉండేలా కనిపిస్తోంది. వార్ 2, నీల్ ప్రాజెక్ట్ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్లు వస్తాయేమో చూడాలి.



# విజయ్‌కి వీరమల్లు టెన్షన్!

సరైన హిట్ లేని రౌడీ స్టార్ విజయ్ దేవరకొండకి 'కింగ్‌డమ్' మూవీ చాలా కీలకంగా మారింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి డైరెక్టర్. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ సినిమా మే 30న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే మూవీ ప్రమోషన్లు జోరందుకున్నాయి. అయితే ఇప్పుడు ఈ సినిమాని పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' సినిమా టెన్షన్ పడుతోంది. ఎందుకంటే ఆరోజే 'వీరమల్లు ' కూడా రిలీజ్ కానుందని టాక్ వినిపిస్తోంది. దీంతో 'కింగ్?డమ్' చిత్ర బృందం, విజయ్ ఫ్యాన్స్ డైలమాలో పడ్డారు. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ కెరీర్లో బిగ్గెస్ట్ పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతోంది 'హరిహర వీరమల్లు'. మార్చిలోనే రిలీజ్ కావాల్సిన ఈ సినిమాని 'మే 9'న విడుదల చేయనున్నట్లు గత నెలలోనే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో తమ 'కింగ్‌డమ్' మూవీని మే 30న తీసుకొస్తున్నట్లు నిర్మాత నాగవంశీ ప్రకటించారు. అయితే పవన్ కళ్యాణ్ షూట్ పెండింగ్ ఉండటం, వీఎఫ్ఎక్స్ పనులు పూర్తికాకపోవడంతో 'హరిహర వీరమల్లు' రిలీజ్‌పై మేకర్స్ ఎటూ తేల్చుకోలేకపోయారు. మే 9కి ఇంకా మూడు రోజులే ఉండటంతో ఈ మూవీ రిలీజ్ కష్టం అన్నది ఫిక్స్ అయిపోయింది. తాజాగా పవన్ కళ్యాణ్ తాజాగా సెట్‌లోకి అడుగుపెట్టడంతో 'వీరమల్లు' మళ్లీ ట్రెండ్‌లోకి వచ్చింది. పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో వస్తున్న 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల తేదీని దృష్టిలో ఉంచుకుని, విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' చిత్రం వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వస్తున్నాయి. ఈ నెల 30న విడుదల కావాల్సిన కింగ్‌డమ్.. అదే సమయానికి హరిహర వీరమల్లు రిలీజ్ అవుతుందన్న వార్తలతో బరిలోకి దిగడంపై ఆలోచనలో పడినట్లు సమాచారం. దీనిపై మేకర్స్ నుంచి కొంతకాలంగా

# సీన్‌లోకి సాయి కుమార్.. నిజమేనంటూ కృష్ణవంశీ క్లారిటీ





క్రియేటివ్ డైరెక్టర్‌గా పేరొందిన కృష్ణవంశీ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. గులాబీ, నిన్నే పెళ్లాడతా, మురారి, ఖడ్గం, అంతఃపురం, చందమామ, శ్రీఆంజనేయం, రాఖీ, సింధూరం వంటి సినిమాలు ఆయనలోని క్రియేటివీకి నిదర్శనంగా నిలుస్తాయి. ముఖ్యంగా 1998లో వచ్చిన 'అంతఃపురం' సినిమా కృష్ణవంశీ క్రేజ్‌ని పదింతలు చేసింది. ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా సృష్టించిన రికార్డులు అన్నీఇన్నీ కావు. ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమాని 2003 లో షారుఖ్ ఖాన్, కరిష్మా కపూర్ ముఖ్య పాత్రల్లో శక్తి: ది పవర్ అనే పేరుతో హిందీలో రీమేక్ ఛేశారు. ప్రకాశ్‌రాజ్, సాయికుమార్, సౌందర్య, జగపతిబాబులకు ఈ మూవీ ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చింది. ఇళయరాజా అందించిన సంగీతం మూవీని మరోస్థాయికి తీసుకెళ్లింది.

తాజాగా ఈ సినిమా క్లిప్పింగ్‌ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన 'బాలు సామాన్యుడు' అనే ఓ నెటిజన్.. 'అంత:పురం' విశేషాలను పంచుకున్నాడు. అది ఆయన మాటల్లోనే ' అంత:పురం' ఈ సినిమాని డిజిటల్ మిక్సింగ్ చేసి మరలా రిలిజ్ చేయండయ్యా.. మహా ప్రభు.. కొన్నిసార్లు సినిమా ప్రేమికుడైన నాలాంటి వాళ్లు కోపం కట్టలు తెంచుకోని అంటే గింటే వాళ్లనీ వీళ్లనీ కాదు..

మా క్రిష్ణ వంశీ గారినే అనాలి.. ఈ మనిషి తిన్నగా ఉండకుండా.. అమ్మ, నాన్న, అక్క, చెల్లి, తమ్ముడు, బాబాయ్, పిన్ని, బావ, బామ్మర్ది, వదిన, మరదలు ఇలా ఉమ్మడి కుటుంబాలలో ఉండే అన్ని రకాల హ్యూమన్ ఏమోషన్స్‌ని 90ల్లో పుట్టిన నా లాంటి వాళ్ల మెదళ్ళలోకి చొప్పించేసారు. దాంతో ఈ కమర్షియల్ ఫోన్ పే, గులాబ్ జామ్ పే లాంటి పూర్ హ్యూమన్ ఏమోషన్స్ జమానాలో ఇమడలేక, స్వతహాగా వచ్చిన ఏమోషన్స్ కి దూరం కాలేక నరకం చూస్తున్నాం.. ఏమోషనల్ అయిన ప్రతిసారి మిమ్మల్నే తిట్టుకుంటా వంశీ గారు...

మీకో విషయం తెలుసా.. ఈ సినిమాలో సాయికుమార్ గారి పాత్రకి మొదట రోజా ఫేమ్ అరవింద్ స్వామి గారిని సంప్రదిస్తే నో చెప్పారట.. అది నిజమేనా?.. పాకం గారి తేనెలో పడ్డట్లు అద్భుతమైన క్యారక్టర్ మా సాయికుమార్ గారిని వరించింది అనేది ఎంత వరకూ వాస్తవం..? ఈ ప్రశ్నలకు మీరే జవాబు చెప్పాలి' అంటూ కృష్ణవంశీని ట్యాగ్ చేసి అడిగాడు. దానికి స్పందించిన కృష్ణవంశీ 'కరెక్ట్ అండీ' అంటూ దండం పెడుతున్నట్లు సింబల్ యాడ్ చేస్తూ రిప్లయ్ ఇచ్చారు. దీన్ని బట్టి అరవింద స్వామి మంచి రోల్‌ని మిస్ చేసుకున్నాడనే చెప్పాలి. 'అంత:పురం' సినిమాలో ఓ విశేషం ఉంటుంది. ఇందులో సాయికుమార్, సౌందర్య మధ్య సముద్రంలో ఓ రొమాంటిక్ సాంగ్ ఉంటుంది. 'అసలేం గుర్తుకురాదు నా కన్నుల ముందు నువ్వు ఉండగా.. అంటూ సింగర్ చిత్ర ఆలపించిన ఎవర్‌గ్రీన్ సాంగ్‌లో సౌందర్య చీర రంగులు మారుతూ ఉంటుంది. అప్పట్లో ఆ సాంగ్ ప్రేక్షకులకు భలేగా అనిపించింది. ఈ విషయాన్ని ఇటీవల ఓ నెటిజన్ కృష్ణవంశీని అడిగారు. 'ఈ చీర రంగులు మార్చే కాన్సెప్ట్ భలేగా చాలా కొత్తగా ఉంది. ఈ ఐడియా మీకు ఎలా వచ్చింది సార్?' అని నెటిజన్ అడగ్గా... ఇందుకు ఆయన స్పందిస్తూ.. అది తమ క్రియేటివిటీ కాదని, మూవీ రిలీజ్ తర్వాత జెమిని టీవీ ఎడిటర్ దాన్ని అలా ఎడిట్ చేశాడని చెప్పారు.



# వాళ్లు ఏం చెప్తే అది చేస్తా

'రాబిన్‌హుడ్' సినిమాలో ఐటెం సాంగ్‌పై చెలరేగిన వివాదంపై నటి కేతికా శర్మ ఎట్టకేలకు స్పందించింది. నటిగా విభిన్న పాత్రలు చేయాలని తన కోరికని.. అందులో భాగంగానే ఐటెం సాంగ్ చేశానని చెప్పింది. నటనలో గ్లామర్ కూడా ఓ భాగమేనని.. దాన్ని తప్పుగా చూడొద్దని చెప్పింది. కథలో అవకాశం ఉంది కాబట్టే ఐటెం సాంగ్ ఒప్పుకున్నానని... డైరెక్టర్ ఏది చెబితే అది చేయడమే తన పని అని స్పష్టం చేసింది. తాజాగా 'సింగిల్' మూవీ ప్రమోషన్లో పాల్గొన్న కేతికా శర్మ ఆ వివాదం గురించి స్పందించింది.

పూరి జగన్నాథ్ కొడుకు ఆకాష్ పూరీ 'రొమాంటిక్' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది ఢిల్లీ బ్యూటీ కేతికా శర్మ. ఆ మూవీలో ఆమెకు గ్లామర్ పరంగా మంచి మార్కులే పడినా కమర్షియల్‌గా సక్సెస్ కాలేదు. ఆ తర్వాత నాగశౌర్యతో 'లక్ష్య', వైష్ణవ్ తేజ్‌తో 'రంగ రంగ వైభవంగా', సాయిధరమ్ తేజ్ పక్కన 'బ్రో' మూవీస్‌లో నటించినా ఒక్కటి కూడా హిట్ కాకపోవడంతో అన్‌లక్కీ గర్ల్‌గా మారిపోయింది. టాలీవుడ్‌లో నాలుగేళ్లుగా హిట్టు కోసం దండయాత్ర చేస్తోన్న కేతిక... ఐటెమ్ గర్ల్‌గా మారినా లక్ కలిసిరాలేదు. 'రాబిన్‌హుడ్' మూవీలో'అదిదా సర్‌ప్రైజు' అంటూ అందచందాలతో రెచ్చిపోయినా ఆ సినిమా డిజాస్టర్ కావడంతో ఆమెను పట్టించుకున్నవారే లేరు. అయితే ఆమె వేసిన హుక్ స్టెప్పులు మాత్రం వివాదాస్పదమయ్యాయి.

ఆ సాంగ్‌లో కేతిక స్టెప్పులు అసభ్యకరంగా ఉన్నాయని డ్యాన్స్ కంపోజ్ చేసి శేఖర్ మాస్టర్, మూవీ యూనిట్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ వివాదాన్ని మహిళా కమిషన్ సుమోటోగా తీసుకుని మేకర్స్‌కి నోటీసులు జారీచేయడంతో ఆ స్టెప్పుని తొలగించారు. ప్రస్తుతం 'సింగిల్' మూవీ ప్రమోషన్లో ఉన్న కేతికా శర్మని ఆ పాట వివాదం గురించి మీడియా ప్రశ్నించగా సమాధానం ఇచ్చింది. 'స్టెప్పుల సంగతి నాకు తెలీదు. డైరెక్టర్ చెప్పినట్లు చేయడమే నా పని. నేను డైరెక్టర్ల నటిని. షూటింగ్‌లో వాళ్లకి కంప్లీట్‌గా సరెండర్ అయిపోతా. వాళ్లు చెప్పింది చేయడం తప్ప నేను పెద్దగా ఏదీ ఆలోచించను. సినిమా నచ్చితే ప్రేక్షకులు ఎంత ఎంజాయ్ చేస్తారో.. నచ్చకపోతే అంతకంటే ఎక్కువ విమర్శిస్తారని నాకు తెలుసు. ఆ ఐటెం సాంగ్‌కి వచ్చిన మిక్స్‌డ్ రెస్పాన్స్, వివాదం గురించి నాకు కూడా అవగాహన ఉంది. నటిగా విభిన్న పాత్రలు చేయాలని నా కోరిక. ప్రత్యేక గీతాల్లో నటించడం తప్పేమీ కాదు. అది కూడా కథలో భాగమే. గ్లామర్ అనేది తప్పుగా చూడకూడదు. అది కూడా నటనలో ఒక భాగమే. ఆ స్టెప్పుపై నాకు మొదట్లో డౌట్ వచ్చింది కానీ డైరెక్టర్ చెప్పడంతో ఒప్పుకున్నాను' చెప్పుకొచ్చింది కేతికా శర్మ.

# 'రెట్రో' చూసి అభినందించిన రజనీ..



సూర్య రెట్రో మూవీతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అయితే రాబట్టుకోలేకపోయాడు. అటు తమిళం లోనూ ప్రభావం చూపించడం లేదు. తెలుగులో అయితే మరీ దారుణంగా పరిస్థితి ఉంది. హిట్ 3 హవాలో రెట్రో కొట్టుకుపోయింది. ఇక తమిళంలో అయినా స్టడీగా వసూళ్లను సాధిస్తుందని అనుకుంటే.. చెప్పుకునే స్థాయిలో కూడా రావడం లేదనిపిస్తోంది. సూర్య రెట్రోకి తమిళంలో డే వన్ 17 కోట్లకు వచ్చాయని అన్నారు. మొత్తంగా చూసుకుంటే 45 కోట్ల ఓపెనింగ్స్ వచ్చాయని ప్రకటించారు. కానీ ఇంత వరకు మళ్లీ కలెక్షన్లకు సంబంధించిన అప్డేట్ ఇవ్వలేదు.

రెట్రో మూవీని అంతా డిజాస్టర్ అని చెప్పేస్తున్నారు. ఆల్రెడీ సోషల్ మీడియాలో అయితే రెట్రో ఓ డిజాస్టర్ అనే ట్రెండ్ నడిచేసింది. కార్తిక్ సుబ్బరాజ్‌కు ఇక అవకాశాలు ఇచ్చి కూడా వృథానే అని అంటున్నారు. ఎన్ని సార్లు ఛాన్స్ ఇచ్చినా కూడా తనని తాను ప్రూవ్ చేసుకోలేకపోతోన్నాడని, కమర్షియల్‌గా సక్సెస్ కాలేకపోతోన్నాడని చెబుతున్నారు. ఇక సూర్య అయితే తన పడిన కష్టానికి ఈ మధ్య సరైన ఫలితం రావడం లేదు.

ఓటీటీలో మాత్రం సూర్యకు కరోనా టైంలో మంచి క్రేజ్ ఏర్పడింది. జై భీం, ఆకాశం నీ హద్దురా అంటూ అందరినీ ఆకట్టుకున్నాడు. ఆ తరువాత థియేటర్లోకి తీసుకు వచ్చిన ప్రతీ చిత్రం డిజాస్టర్ అవుతూనే ఉంది. ఇప్పుడు ఈ రెట్రో సైతం బెడిసి కొట్టేసిందని చెప్పుకోవచ్చు. చివరగా కంగువా అంటూ కోలీవుడ్‌ను పెద్ద దెబ్బ కొట్టేశారు. ఆ సినిమా దారుణమైన ఫలితాన్ని మూటగట్టుకుంది. ఇక ఇప్పుడు రెట్రో అంటూ సూర్య మరోసారి అభిమానుల్ని నిరాశపర్చాడు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,